ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755


ఆవేదనతో పెట్రోలు పోసుకుంటూ...


ఆక్రోశంతో మాట్లాడుతూ...



పోలీసు నిర్బంధంలోనూ సడలని స్థైర్యం


ఆస్పత్రిపాలై అచేతనంగా



న్యాయం కోసం నినాదం


ఆర్డీవో ఆఫీసు ముందు టీడీపీ దీక్షా శిబిరం వద్దకు చేరిన వైసీపీ శ్రేణులు

దొంగ ఓట్లను తొలగిస్తారా? లేదా?

- చంద్రగిరి నియోజకవర్గంలో దొంగ ఓట్లను తొలగించాలంటూ దీక్ష చేపట్టిన విపక్షం
- పోటీగా దీక్షకు దిగిన వైసీపీ శ్రేణులు

పోలీసుల తీరును నిరసిస్తూ ఒంటిపై పెట్రోల్ పోసుకున్న పులివర్తి నాని ● అస్వస్థతకు గురవడంతో స్విమ్స్‌లో చికిత్స


తెలుగు మహిళల అరెస్టు

తిరుపతి (రవాణా), జనవరి 8: చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో దొంగ ఓట్లను ఎప్పుడు తొలగిస్తారని టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని ప్రశ్నించారు. తిరుపతి ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం ఉదయం దొంగ ఓట్లను తొలగించాలంటూ ఆయన నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పులివర్తి నాని మీడియాతో మాట్లాడుతూ ఆర్డీవో నుంచి కలెక్టర్, ఎన్నికల కమిషన్ దాకా దొంగ ఓట్లను తొలగించాలని వందలాది వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి న్యాయం జరగలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు బీఎల్వోలకు షోకాజ్ నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి కనుసన్నల్లోనే ఈ తతంగమంతా జరిగిందని ఆరోపించారు. ఇప్పటికైనా ఈసీ అధికారులు చొరవ తీసుకుని దొంగ ఓట్లను పూర్తిగా తొలగించడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.నానీకి మద్దతుగా నియోజకవర్గపరిధిలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున నిరాహార దీక్షలో పాల్గొన్నారు.దొంగ ఓట్లు తొలగించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ నినాదాలు చేశారు. చంద్రగిరి నియోజకవర్గ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం నాయుడు, గౌస్‌బాషా, మధు, హేమాంబరధరరావు, ఈశ్వరయ్య, పెరుగు భాస్కర్‌రెడ్డి,సింగ్ సుధ, మహేశ్వరి,సురేష్ నాయుడు, బిరుదాల భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.కాగా నాని చేపట్టిన దీక్షకు తిరుపతి టీడీపీ నాయకులు సంఘీభావం తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ చైర్మన్ నరసింహయాదవ్, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, కృష్ణయాదవ్, కోడూరు బాలసుబ్రహ్మణ్యం, రవి మనోహరాచారి తదితరులు మద్దతు తెలిపారు.

టీడీపీ దీక్షను నీరుగార్చేందుకు రంగంలోకి వైసీపీ

ఉదయం 11గంటల ప్రాంతంలో ప్రారంభమైన దీక్షను జోరువానలోనూ పులివర్తి నాని కొనసాగించారు. దీక్షకు పెద్దఎత్తున మద్దతు లభించడం, నియోజకవర్గంలో చర్చనీయాంశం కావడంతో వైసీపీ అప్రమత్తమైంది.టీడీపీ దీక్షను ఎలాగైనా నీరుగార్చాలన్న ఉద్దేశంతో తిరుపతి రూరల్ ప్రాంతంలోని అవిలాల సర్పంచ్ సీవీ రమణ, పేరూరు సర్పంచ్ దామినేటి కేశవులు, మల్లంగుంటకు చెందిన వైసీపీ నేత రామచంద్రయ్య, వేదాంతపురానికి చెందిన ప్రేమ్‌కుమార్, సి.మల్లవరానికి చెందిన మల్లారపు వాసు, గాంధీపురానికి చెందిన మన్నూరు శివ, సెల్వం తదితరులు మధ్యాహ్నం 2.15గంటల ప్రాంతంలో ఆర్డీవో కార్యాలయం వద్దకు చేరుకుని టీడీపీ దీక్ష శిబిరం పక్కనే దీక్ష చేపట్టారు.టీడీపీ తరఫున దొంగ ఓటర్లను తొలగించాలంటూ నినాదాలు చేస్తే దళితుల ఓట్లను తొలగించిన టీడీపీ నేతలపై చర్యలు తీసుకోవాలంటూ వైసీపీ శ్రేణులు నినాదాలు చేశాయి. దీంతో ఆర్డీవో కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.డీఎస్పీలు యశ్వంత్, సురేంద్ర రెడ్డి, సీఐలు అబ్బన్న, శివప్రసాద్‌రెడ్డి, జయనాయక్, ఎస్‌ఐలు సిబ్బందితో రంగప్రవేశం చేసి వైసీపీ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం టీడీపీ నాయకులను, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. దీక్ష విరమించాలని లేకపోతే అరెస్టు చేయాల్సి వస్తుందని నానీకి చెప్పడంతో తాను శాంతియుతంగా దీక్ష చేస్తున్నానని చెప్పారు.దీక్ష విరమించబోనని అవసరమైతే ఆత్మహత్యకు సిద్ధమవుతానని చెప్పి పెట్రోలు ఒంటిపై పోసుకున్నారు. దీంతో మరింత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వెంటనే కొందరు కార్యకర్తలు సైతం ఒంటిపై పెట్రోల్ పోసుకున్నారు. గమనించిన పోలీసులు పెట్రోల్ క్యాన్‌ను పక్కకు లాగేసి మంచినీళ్లు పోశారు.ఆయన్ను పోలీసులు అదుపులోకి తీసుకుని తిరుచానూరులో ఇంటివద్ద వదిలిపెట్టారు. పెట్రోల్ ఒంటిపై పోసుకున్న సమయంలో కళ్లలో పడటంతో నాని అస్వస్థతకు గురయ్యారు.దీంతో పార్టీ శ్రేణులు స్విమ్స్ ఆస్పత్రికితరలించారు.అక్కడ డాక్టర్లు ఆయనకు వైద్యం అందించి భయపడాల్సిన అవసరం లేదన్నారు.స్విమ్స్‌లో నాని చేరిన విషయం తెలుసుకున్న టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున స్విమ్స్‌కు తరలివచ్చారు.


వైసీపీ శ్రేణుల అరెస్టు

నారాయణస్వామికి ఎదురుగాలి

- ఆయనకు టికెట్ ఇస్తే ఓడిస్తామంటున్న వ్యతిరేకవర్గం
- ఆయనే కావాలంటున్న అనుకూల వర్గం
- వైసీపీలో ఇన్‌చార్జుల మార్పు నేపథ్యంలో పెరిగిన వేడి

జీడీనెల్లూరు పాలిటిక్స్

చిత్తూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వైసీపీ చాలాచోట్ల ఎమ్మెల్యేలను పోటీ నుంచి పక్కకు తప్పిస్తోంది. జిల్లాలో ఇప్పటికే పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు ఆ పార్టీ అధిష్ఠానం టికెట్ నిరాకరించిన విషయం.. చిత్తూరులోనూ ఆరణి శ్రీనివాసులును మారుస్తున్నట్లు జరుగుతున్న ప్రచారం తెలిసిందే. మరోవైపు రాష్ట్రంలోని పలు నియోజక వర్గాల్లో ఎమ్మెల్యేల స్థానంలో కొత్తగా ఇన్‌చార్జులను నియమిస్తోంది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం, జీడీనెల్లూరు ఎమ్మెల్యే నారాయణస్వామిని కూడా మార్చాలంటూ అక్కడ సొంత పార్టీ నుంచి తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. సోమవారం పెనుమూరు మండలం పులిగుండు శివాలయం వద్ద నారాయణస్వామి వ్యతిరేక వర్గం సమావేశమై నారాయణస్వామికి టికెట్ వద్దని, కొత్త అభ్యర్థిని ప్రకటిస్తే గెలిపించుకుంటామని తీర్మానించారు. నియోజకవర్గంలో ముందు నుంచీ జ్ఞానేంద్రరెడ్డి వర్గం వ్యతిరేకంగా ఉన్నప్పటికీ.. రాష్ట్ర వ్యాప్తంగా అభ్యర్థుల మార్పులు చేర్పుల నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. పెనుమూరు మండలానికి చెందిన మాజీ ఎంపీ, ఎన్‌ఆర్‌ఐ సలహాదారు జ్ఞానేంద్రరెడ్డికి, డిప్యూటీ సీఎం నారాయణస్వామికి తొలి నుంచీ పడటంలేదు సమయం దొరికినప్పుడల్లా పరస్పరం విమర్శలు చేసుకుంటున్నారు. ఆ మధ్య పెనుమూరు మండల సర్వసభ్య సమావేశానికి నారాయణస్వామి వస్తున్నారని తెలిసి.. మొదలైన 5 నిమిషాలకే జ్ఞానేంద్రరెడ్డి వర్గమైన ఎంపీపీ హేమలత సమావేశాన్ని ముగించారు. గడప గడపలో భాగంగా జ్ఞానేంద్రరెడ్డి, ఎంపీపీల సొంత గ్రామమైన గుంటిపల్లెకు డిప్యూటీ సీఎం వస్తుండగా రోడ్డుకు అడ్డంగా ముళ్ల కంచె వేసి అడ్డుకున్నారు. ఇటీవల పెనుమూరులో జరిగిన పెంచిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి నారాయణస్వామి హాజరయ్యారని ఎంపీపీ హేమలత, జడ్పీటీసీ దొరస్వామి సహా మరికొందరు నాయకులు గైర్హాజరయ్యారు. ఇటీవల జీడీనెల్లూరు టికెట్ మళ్లీ నారాయణస్వామికే అని ఆయన అనుచరులు పెనుమూరులో టపాసులు పేల్చి సంబరాలు జరుపుకొన్నారు. వెంటనే మరుసటిరోజు జ్ఞానేంద్రరెడ్డి వర్గమైన దయాసాగర్ రెడ్డి మరికొందరు తిరుపతిలో మంత్రి పెద్దిరెడ్డిని కలిసి స్వామికి టికెట్ ఇవ్వద్దంటూ కోరారు. అలాగే సజ్జలతోనూ తమ అభ్యంతరాన్ని వివరించినట్లు తెలిసింది.



నారాయణస్వామి వద్దు అని ప్లకార్డులు చూపుతున్న వైసీపీ నాయకులు

'ముద్దు.. వద్దు..' అంటూ పరస్పర సమావేశాలు

నారాయణస్వామి వద్దంటూ సోమవారం పులిగుండు శివాలయం వద్ద జ్ఞానేంద్రరెడ్డి వర్గం సమావేశమై తీర్మానించింది. ఆయనకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించింది. మరోవైపు నారాయణస్వామి కావాలంటూ ఆయన అనుకూల వర్గం కూడా ప్లకార్డులు చూపుతూ మీడియా సమవేశం నిర్వహించారు. దీనిపై మంగళవారం సమావేశం కానున్నట్లు సమాచారం.


అంగన్వాడీ ఉద్యోగులతో కలిసి నినదిస్తున్న నారాయణ, మురళి తదితరులు

వర్షానికీ వెరవని అంగన్వాడీలు

సమ్మెలో భాగంగా జోరుగా ఆందోళనలు, నిరసనలు

తిరుపతి, చంద్రగిరిల్లో సీపీఐ నారాయణ సంఘీభావం

తిరుపతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గడచిన 28 రోజులుగా సమ్మెలో వున్న అంగన్వాడీ ఉద్యోగులు జోరువానకూ వెరవకుండా సోమవారం జిల్లావ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలూ కొనసాగించారు. నాయుడుపేటలో అంగన్వాడీ చిన్నారులకు కాలకృత్యాలు శుభ్రపరుస్తూ ఉద్యోగులు వినూత్న రీతిలో ప్రభుత్వానికి నిరసన తెలియజేశారు. కోట మండల కేంద్రంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగించిన సిబ్బంది ఎస్మా జీవో ప్రతులు తగులబెట్టారు. చంద్రగిరిలో వర్షం పడుతున్నప్పటికీ లెక్కచేయకుండా కార్యకర్తలు, సహాయకులు ర్యాలీ నిర్వహించగా సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ పాల్గొని వారికి సంఘీభావం ప్రకటించారు.అంగన్‌వాడీ వర్కర్లపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు.ఎస్మా చట్టాన్ని మర్డర్లు చేసేవారిపైనో, ఎర్రచందనం స్మగ్లర్లపైనో, ఖూనీకోర్లపైనో, మైనింగ్ మాఫియాపైనో పెట్టాలే తప్ప అంగన్‌వాడీ వర్కర్లపై కాదన్నారు.తిరుపతి పాత మున్సిపల్ కార్యాలయం కూడలిలో రిలే నిరాహార దీక్షలు కొనసాగించిన వర్కర్లు, హెల్పర్లు వర్షంలోనే మానవహారం నిర్మించారు. ఇక్కడ కూడా సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ పాల్గొని మద్దతు ప్రకటించారు.ఎస్మా ప్రయోగానికి భయపడవద్దంటూ ఉద్యోగులకు ధైర్యం చెప్పారు. గూడూరు, వెంకటగిరి, సూళ్ళూరుపేట, శ్రీకాళహస్తి, సత్యవేడు, పుత్తూరు, పిచ్చాటూరు తదితర చోట్ల ఓవైపు వర్షం కురుస్తున్నా గొడుగులు పట్టుకుని అంగన్వాడీ ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు.

ముగ్గురు వైసీపీ నేతలపై క్రిమినల్ కేసు

- నకిలీ సర్టిఫికెట్లతో గ్రాడ్యుయేట్ ఓటర్లుగా నమోదు
- వీరిలో ఇద్దరు కార్పొరేటర్లు... మరొకరు మహిళా నేత

తిరుపతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గతేడాది జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తిరుపతికి చెందిన ముగ్గురు వైసీపీ నాయకులు నకిలీ సర్టిఫికెట్లతో గ్రాడ్యుయేట్ ఓటర్లుగా నమోదయ్యారు. వీరి సర్టిఫికెట్లు నకిలీవని తేలడంతో క్రిమినల్ కేసు నమోదైంది.గతేడాది మార్చిలో రాయలసీమ తూర్పు నియోజకవర్గ పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల్లో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 8వ డివిజన్ కార్పొరేటర్ మునిరామిరెడ్డి, 12వ డివిజన్ కార్పొరేటర్ ఎస్కే బాబు, కొర్లగుంటకు చెందిన వైసీపీ నాయకురాలు విజయ ఓటర్లుగా నమోదయ్యారు. అయితే వీరు పట్టభద్రులు కాదని అప్పట్లో టీడీపీ పరిశీలకులుగా వ్యవహరించిన ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు వీరిపై తిరుపతిలో రెవిన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే రాష్ట్ర పార్టీ నేతల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై టీడీపీ రాష్ట్ర కార్యాలయం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదులపై స్పందించిన రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఓటర్లుగా నమోదయ్యేందుకు ముగ్గురు వైసీపీ నాయకులు సమర్పించిన సర్టిఫికెట్లు నిజమైనవేనా అని విచారణ నిర్వహించగా అవన్నీ ఫేక్ సర్టిఫికెట్లని తేలింది. దీంతో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో వైసీపీ నాయకులు వనజ, మునిరామిరెడ్డి, ఎస్కే బాబులపై క్రైమ్ నంబరు 157-2023 పేరిట క్రిమినల్ కేసు నమోదైంది. ఐపీసీ సెక్షన్ 171 డి, అలాగే ప్రజాప్రాతినిధ్య చట్టం 1950 సెక్షన్ 31 కింద ఈ కేసు నమోదైంది. అయితే జిల్లా అధికార యంత్రాంగం ఈ విషయాన్ని గోప్యంగా వుంచింది. తాజాగా 2024 సార్వత్రిక ఎన్నికలకు చేపట్టిన ఓటర్ల జాబితా సవరణల్లో పెద్దఎత్తున అవకతవకలు జరుగుతున్నాయని టీడీపీ కార్యాలయం నుంచీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు వెళ్ళిన సంగతి తెలిసిందే. ఆ ఫిర్యాదులపై తీసుకున్న చర్యలు వివరిస్తూ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి టీడీపీ కార్యాలయానికి సోమవారం పంపిన లేఖలో ఈ అంశాన్ని ప్రస్తావించడంతో సుమారు ఆరు నెలలు ఆలస్యంగా వైసీపీ నేతలపై కేసు నమోదైన సంగతి వెలుగు చూసింది.బాధ్యత కలిగిన డివిజన్ కార్పొరేటర్లుగా ప్రజాప్రతినిధులుగా వ్యవహరిస్తూ తప్పుడు విద్యార్హతల సర్టిఫికెట్లు సమర్పించి పట్టభద్రులమని ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లుగా పేర్లు నమోదు చేయించుకోవడం పట్ల తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

తిరుపతి(ఆటోనగర్) జనవరి 8: సంక్రాంతి పండుగ సందర్భంగా రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే తిరుపతి-సికింద్రాబాదు-కాకినాడ మధ్య ప్రత్యేక రైళ్లు (07055-07072-02707) నడపనున్నట్లు సీపీఆర్‌ఓ సీహెచ్ రాకేష్ తెలిపారు. ఈ రైళ్లు ఈ నెల 10, 14, 15 తేదీలలో రాకపోకలు సాగిస్తాయన్నారు.

నానికి హాని జరిగితే తీవ్ర పరిణామాలు

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి హేమాంబరధరరావు

చంద్రగిరి, జనవరి 8: చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు పులివర్తి నాని ప్రాణాలకు ఏదైనా హాని జరిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు హెచ్చరించారు. చంద్రగిరి నియోజకవర్గంలో దొంగ ఓట్లు తొలగించకపోవడంపై పులివర్తి నాని తిరుపతిలో అమర నిరాహారదీక్షకు పూనుకొన్నారని, దీక్షను భగ్నం చేయాలని పోలీసులు జులుం ప్రదర్శించారని తెలిపారు. వైసీపీ కార్యకర్తలు మరో టెంటు వేసుకుని ఆకతాయి పనులు చేశారని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



భాకరాపేట, జనవరి 8: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు భాకరాపేట గీతాంజలి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ గిరికుమార్ రెడ్డి తెలిపారు. ఈ నెల 7న రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలో రూరల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి పోటీలలో 9వ తరగతి చదువుతున్న మహమ్మద్ రౌనఖ్, నబీల్ అహ్మద్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్, హెచ్‌ఎం స్వాతి, పీడీ కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు అభినందించారు.

గీతాంజలి పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు



భాకరాపేట, జనవరి 8: భాకరాపేట గీతాంజలి ఉన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు డూడూ బసవన్న, హరిదాసు వేషధారణ, రంగవల్లులతో అలరించారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కరస్పాండెంట్ గిరికుమార్ రెడ్డి, హెచ్‌ఎం స్వాతి, ఉపాధ్యాయులు పండుగ విశిష్టతను తెలియజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్సీపురంలో మోస్తరు వర్షం

రామచంద్రాపురం, జనవరి 8: రామచంద్రాపురం మండలంలో సోమవారం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం 7గంటల ప్రాంతంలో భారీ వర్షం కురవగా సాయంత్రం వరకు చిరుజల్లులు పడ్డాయి. ఈ వర్షం కారణంగా వరినాట్లకు అంతరాయం ఏర్పడింది. అనుకోని వర్షం కారణంగా గంగిరెడ్డి పల్లె, కేకేవీపురం వద్ద ఇటుక బట్టీల్లో ఇటుకలు తడసి ముద్దయ్యాయి

తిరుమల నడకమార్గాల్లో నిర్భయంగా రావొచ్చు: టీటీడీ ఈవో

తిరుమల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : తిరుమల నడకమార్గాల్లో అడవి జంతువుల నుంచి భక్తుల రక్షణ కోసం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని, నిర్భయంగా శ్రీవారి దర్శనానికి నడిచి రావచ్చని టీటీడీ ఈవో ధర్మారెడ్డి అన్నారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో సోమవారం టీటీడీ, ప్రభుత్వ ఫారెస్ట్ అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ నడకమార్గాల్లో అడవి జంతువుల నుంచి భక్తుల రక్షణ కోసం ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(వైల్డ్‌లైఫ్), ఏపీ చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ అధ్యక్షతన రాష్ట్ర ప్రభుత్వం జాయింట్ కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ఆ కమిటీ క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి నివేదిక సమర్పించిందన్నారు. టీటీడీ, ప్రభుత్వ అటవీశాఖ ఇప్పటి వరకు తీసుకున్న స్వల్పకాలిక చర్యలపై చర్చించారు. దీర్ఘకాలిక చర్యలైన అడవి జంతువుల పర్యవేక్షణ, అందుకు కావాల్సిన భవన సదుపాయం, సిబ్బంది, వ్యూలైన్ల ఏర్పాటు, బయోఫెన్సింగ్(పొదల కంచె), ఏరియల్ వాక్ వే, అండర్‌పాస్, ఓవర్ పాస్‌ల కోసం స్థల ఎంపిక ఇతర మౌలిక వసతులపై చర్చించారు. కెమెరాట్రాప్‌లు, మానిటరింగ్ సెల్, వ్యూలైన్ల ఏర్పాటు, అవుట్ పోస్టుల నిర్వహణకు సత్వరం చర్యలు చేపట్టాలని, ఏడవమైలు నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు నడకదారికి ఇరువైపులా లైటింగ్ వసతి కల్పించాలని, మానిటరింగ్ సెల్ కోసం భవనాన్ని సమకూర్చాలని సీఈని కోరారు. నడక మార్గాల్లో వ్యర్థాలు లేకుండా చూడాలని హెల్త్ ఆఫీసర్‌ను ఆదేశించారు. ఈ సమావేశంలో జేఈవో వీరబ్రహ్మం, సీసీఎఫ్ నాగేశ్వరరావు, ఎఫ్ఏసీఏవో బాలాజీ, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, జూపార్క్ క్యూరేటర్ సెల్వం, డీఎఫ్‌వో శ్రీనివాస్, తిరుపతి డీఎఫ్‌వో సతీష్ పాల్గొన్నారు.

ఓఆర్ఐ పరిశోధకుడు నరేష్ మృతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 8: ఎస్వీ యూనివర్సిటీ ప్రాచ్య పరిశోధనా సంస్థ (ఓఆర్ఐ) పరిశోధకుడు డాక్టర్ వెలిగారం నరేష్ (43) మృతి చెందారు. చిత్తూరు సమీపంలో గల బ్రాహ్మణపల్లెకు చెందిన ఆయన తరిగొండ వెంగమాంబ సాహిత్యంపై ఆచార్య చిట్రాజు గోవిందరాజుల పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. కొంతకాలంగా కామెర్లతో బాధపడుతూ సోమవారంకన్నుమూశారు. నరేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతి పట్ల ఓఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ పీసీ వేంకటేశ్వర్లు సంతాపం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి వారు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఏపీ హిస్టరీ కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శిగా ప్రొఫెసర్ నాగోలు కృష్ణారెడ్డి



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 8: ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శిగా ప్రొఫెసర్ నాగోలు కృష్ణారెడ్డి నియమితులయ్యారు. ఈనెల 6, 7 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించిన ఏపీ హిస్టరీ కాంగ్రెస్ 46వ వార్షిక సదస్సులో ఆయన్ను ఎన్నుకున్నారు. ఎస్వీయూనివర్సిటీ ప్రాచీన భారతదేశ చరిత్ర, సంస్కృతి, పురావస్తు విభాగంలో ప్రొఫెసర్‌గా పదవీ విరమణ పొందారు. టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తిరుమల మ్యూజియం డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. చరిత్ర, సంస్కృతి, సాహిత్యంపై 16 పుస్తకాలు, 95 పరిశోధనా వ్యాసాలు రాశారు. 72 జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్నారు. ప్రత్యేకించి శాసనాల వెనుక దాగున్న చరిత్రను వెలికితీశారు. ఇదివరకే ఏపీ హిస్టరీ కాంగ్రెస్ ప్రొసీడింగ్స్‌కు సంపాదకులుగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏపీ హిస్టరీ కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు. ఎస్వీయూ ఓఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ పీసీ వేంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు.

పోలీసు స్పందనకు 64 ఫిర్యాదులు

తిరుపతి(నేరవిభాగం),జనవరి8:తిరుపతిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 64 ఫిర్యాదులు వచ్చాయి. అదనపు ఎస్పీలు విమలకుమారి, కులశేఖర్, చంద్రగిరి ఎస్‌డీపీవో యశ్వంత్ బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వాటిని తక్షణమే పరిష్కరించే దిశగా కృషి చేయాలని పోలీసు అధికారులకు ఆదేశించారు.

హైదరాబాదుకు మరో స్టార్‌లైనర్

తిరుపతి(కొర్లగుంట), జనవరి 8 : హైదరాబాదుకు జిల్లా నుంచి మరో స్టార్‌లైనర్(నాన్ ఏసీ స్లీపర్) సర్వీసు అందుబాటులోకి వచ్చినట్లు డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే తిరుపతి నుంచి ఓ సర్వీసు నడుస్తుండగా ప్రయాణికుల కోరిక మేరకు వెంకటగిరి నుంచి రెండు రోజుల క్రితం అందుబాటులోకి వచ్చింది. వెంకటగిరి ఆర్టీసీ బస్టాండు నుంచి ప్రతి రోజు రాత్రి 7.30గంటలకు బయల్దేరుతుంది. గూడూరు, నెల్లూరు, కావలి, ఒంగోలు, మిర్యాలగూడ మీదుగా హైదరాబాదు, బీహెచ్‌ఈఎల్‌కు మరుసటి రోజు ఉదయం 8గంటలకు చేరుకుంటుంది. అలాగే బీహెచ్‌ఈఎల్ నుంచి ప్రతి రోజు సాయంత్రం 6 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు వెంకటగిరికి చేరుకుంటుంది. ముందస్తు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు.

ప్రభుత్వ పథకాలపై సమీక్ష

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 8: రెవెన్యూ అంశాలు, జగన్న ఆరోగ్య సురక్ష ఫేజ్ 2, పౌరసరఫరాలు, జర్నలిస్టు హౌసింగ్ స్కీం తదితర అంశాలపై సీఎంవో కార్యాలయం నుంచి సీఎంవో ప్రత్యేక కార్యదర్శి పూనం మాలకొండయ్య సంబంధిత అధికారులతో సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి జేసీ శుభం బన్సల్, డీఆర్వో పెంచలకిషోర్, డీఎంహెచ్‌వో శ్రీహరి, డాక్టర్ తేజస్విని, జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి బాలకొండయ్య, కలెక్టరేట్ ఏవో జయరాములు పాల్గొన్నారు.

దాడి : ఇద్దరిపై కేసు నమోదు

చంద్రగిరి, జనవరి 8: చంద్రగిరిలో ఆదివారం రాత్రి జరిగిన దాడిలో ఇద్దరిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు ...చంద్రగిరికి చెందిన హేమంత్, అరవింద్, ఐతేపల్లె రవి కారులో చంద్రగిరి నుంచి తిరుపతి వెళుతుండగా పోలీస్‌స్టేషన్ సమీపంలో రెండు బైక్‌లపై సంతోష్, ద్యూక్ వేగంగా ఎదురుగా వచ్చారు. ఈ క్రమంలో చూసుకుని డ్రైవింగ్ చేయాలని కారులో ఉన్న హేమంత్ కేకలు వేయగా సంతోష్, ద్యూక్ బాలా వచ్చి కారులో ఉన్న హేమంత్, అరవింద్‌పై దాడి చేశారు. ఈ దాడిలో హేమంత్ తలకు తీవ్ర రక్త గాయమైంది. బాధితుల ఫిర్యాదు మేరకు సంతోష్, ద్యూక్ బాలాపై కేసు నమోదు చేశారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

చంద్రగిరి, జనవరి8: చంద్రగిరి ద్వారకానగర్‌లోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈనెల 10వ తేదీ నుంచి 30 రోజులపాటు మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు ఉండి కనీసం పదోతరగతి చదివి ఉండాలన్నారు. వివరాలకు 7989680587, 949495128 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగం దుర్మార్గం

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



వర్షంలో అంగన్‌వాడీ వర్కర్ల ర్యాలీలో పాల్గొన్న సీపీఐ నేత నారాయణ

చంద్రగిరి, జనవరి 8 అంగన్వాడీ వర్కర్లపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం దుర్మార్గమని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. సోమవారం చంద్రగిరిలో సమ్మె చేస్తున్న అంగన్వాడీ వర్కర్లకు సీపీఐ నేత నారాయణ సంఘీభావం తెలిపారు. అనంతరం వర్షంలోనే అంగన్వాడీ వర్కర్లతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లు న్యాయమైన సమస్యల కోసం సమ్మె చేస్తున్నారన్నారు. 26 రోజులుగా అంగన్వాడీ వర్కర్లు రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తుంటే ముఖ్యమంత్రి జగన్ పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారని విమర్శించారు. ఇంతవరకూ వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితులను అరెస్ట్ చేయలేదని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం మైనింగ్ మాఫియాకు కొమ్ము కాస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రామానాయుడు, శ్రీరాములు, సీఐటీయూ నాయకులు రాధాకృష్ణ, మురళి, అంగన్వాడీ వర్కర్లు వాణిశ్రీ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ రాష్ట్రాన్ని పాలించే అర్హత కోల్పోయింది

టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుగుణమ్మ



మీడియాతో మాట్లాడుతున్న సుగుణమ్మ

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 8: వైసీపీ రాష్ట్రాన్ని పరిపాలించే అర్హత కోల్పోయిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుగుణమ్మ విమర్శించారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చి సీఎం జగన్ రాష్ట్రంలో అన్ని వర్గాలను, వనరులను దోచుకున్నారని తెలిపారు. టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లకు రంగులు వేసి ఇవ్వడమంటే సొమ్ముకరిది సోకు మరొకడిదిలా ఉందని ఎద్దేవా చేశారు. టీటీడీ ఛైర్మన్ తన కుమారుడిని గెలిపించుకునేందుకు చెయ్యరాని తప్పులు చేస్తున్నారని ఆరోపించారు. నగర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు. కేవలం కమీషన్ల కోసమే కొత్త నిర్మాణాలు చేపట్టారన్నారు. తిరుపతిలో నిర్మించిన మాస్టర్ ప్లాన్ రోడ్లు ఎవరికి ఉపయోగమో చెప్పాలన్నారు. వైసీపీ వచ్చే ఎన్నికల్లో దొంగోట్లతో గెలవాలని చూస్తోందని, దీన్ని అడ్డుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్పొరేటర్ ఆర్‌సీ మునికృష్ణ, భాస్కర్‌యాదవ్, రమణ, శాంతమ్మ, చిన్నబాబు, సావిత్రమ్మ, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో పులివర్తి నానికి చికిత్స

● పరామర్శించిన టీడీపీ నేతలు



తిరుపతి సిటీ, జనవరి 8 : ఒంటిపై పెట్రోలు పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన టీడీపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి పులివర్తి నానిని చికిత్స నిమిత్తం సోమవారం టీడీపీ నేతలు స్విమ్స్ అత్యవసర విభాగానికి తీసుకువచ్చారు. చంద్రగిరి నియోజకవర్గంలో దొంగ ఓట్లు తొలగించాలని తిరుపతి ఆర్డీవో కార్యాలయం ముందు ఆయన ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. ఈ నేపథ్యంలో పోలీసులు అక్కడకు చేరుకుని దీక్ష విరమించాలని, లేకపోతే అరెస్టు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆయన దీక్ష విరమించేది లేదని, అవసరమైతే ఆత్మహత్యకు సిద్ధమవుతామని చెప్పి పెట్రోలు ఒంటిపై పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆ సమయంలో పెట్రోలు కంట్లో పడటంతో తెరవలేని స్థితిలోకి చేరాడు. వెంటనే చికిత్స నిమిత్తం స్విమ్స్ అత్యవసర విభాగానికి తీసుకువచ్చారు. అక్కడి డాక్టర్లు వైద్యం అందించి భయపడాల్సిన అవసరం లేదన్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహ యాదవ్, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ టీడీపీ నేతలతో కలసి ఆయన్ను పరామర్శించారు. వారి వెంట పులుగోరు మురళి, బుల్లెట్ రమణ, చిన్నబాబు, బ్యాంకు శాంతమ్మ తదితరులు ఉన్నారు.

కొత్త ఔషధం అభివృద్ధిలో ఏఐ కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ అయ్యపన్ చతుర్వేది

రామచంద్రాపురం, జనవరి 8: కొత్త ఔషదం అభివృద్ధిలో కృత్రిమ మేధ, డేటా అనలిటిక్స్ వంటి డిజిటల్ టెక్నాలజీ కొత్త మార్పులు తీసుకువస్తూ కీలకంగా మారాయని అమెరికాకు చెందిన ఆర్కస్ బయోసైన్స్ సీనియర్ డైరెక్టర్ ప్రొఫెసర్ అయ్యప్పన్ చతుర్వేది తెలిపారు. వెంకటరామాపురం సమీపంలోని సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాలలో సోమవారం 'ఎమర్జింగ్ ఇన్నోవేటివ్ ట్రెండ్స్, ఛాలెంజస్ ఇన్ డ్రగ్ డిస్కవరి అండ్ డెవలప్‌మెంట్ అనే అంశంపై రెండురోజుల పాటు అంతర్జాతీయ సదస్సును సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాల, అసోసియేషన్ ఆఫ్ ఫార్మాసూటికల్ టీచర్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వంచారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ప్రొఫెసర్ అయ్యప్పన్ చతుర్వేది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్నాలజీ వలనే కొవిడ్ ఔషధాలను త్వరగా మార్కెట్‌లోకి తీసుకురాగలిగారన్నారు. ఊటీకి చెందిన జేఎస్ఎస్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఫార్మాసూటిక్ విభాగాధిపతి డాక్టర్ గౌతమ్‌రాజన్ మాట్లాడుతూ కొత్త టెక్నాలజీల ద్వారా కొత్త ఔషధం అభివృద్ధి సులభతరం అయిందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.నిరంజన్‌బాబు మాట్లాడుతూ వ్యాధుల నిర్ధారణలో డ్రగ్ డిజైనింగ్ ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెవెన్ హిల్స్ కళాశాల అకడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.శరవణకుమార్, వివిధ విభాగాధిపతులు, బోధన సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌ను ముట్టడించిన మున్సిపల్ కార్మికులు



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 8: తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. వెంకటగిరి, గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట మున్సిపల్ కార్మికులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు 14రోజులుగా సమ్మె చేస్తున్నా వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పూనుకోకపోవడం బాధాకరమన్నారు. పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ కార్మికులకు రిస్క్ అలవెన్స్, 11వ పీఆర్సీ ప్రకారం జీతాలు ఇవ్వాలన్నారు. మరో మూడేళ్ల రూపాయి కూడా జీతాలు పెంచడం జరగదని చెప్పడం కార్మికులను అవమానపరిచేదిగా ఉందని పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించకపోగా కార్మికులపై దాడులకు గూండాలను ఉసిగొల్పుతున్నారన్నారు. మద్దతు తెలుపుతున్న సీఐటీయూ నాయకులపై బైండోవర్ కేసులు పెట్టడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ ఆర్.లక్ష్మి, సీఐటీయూ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపి, పద్మనాభం వడ్డిపల్లి చెంగయ్య, చాలప వెంకటేశ్వర్లు, సుబ్బన్న, లక్ష్మి, ప్రభావతి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని ఊడ్చి గంగలో వేస్తారు

● సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శ



నగరిలో మున్సిపల్ కార్మికులతో కలిసి సమ్మెలో పాల్గొన్న నారాయణ

నగరి, జనవరి 8: అంగన్వాడీ కార్యకర్తలు, పారిశుధ్య కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకుంటే వైసీపీ ప్రభుత్వాన్ని ఊడ్చి గంగలో వేస్తారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ హెచ్చరించారు. నగరి మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం జరిగిన సమ్మెలో ఆయన పాల్గొన్నారు. పారిశుధ్య పనులు చేస్తూ ప్రజలను అనారోగ్యం నుంచి కాపాడే కార్మికులు రోడ్డెక్కి ధర్నా చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. తమ న్యాయమైన కోర్కెల సాధన కోసం పోరాడుతున్న వారి విషయంలో ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా ఉండటాన్ని ఖండిస్తున్నట్లు చెప్పారు. అంగన్వాడీ కార్యకర్తలు 27 రోజులుగా సమ్మె చేస్తున్నా వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోగా ఎస్మా చట్టాన్ని తేవడంతో ప్రభుత్వం తన గొయ్యిని తానే తవ్వుకున్నట్లయిందన్నారు. మహిళా కార్మికులని కూడా చూడకుండా మంత్రులు, ఎమ్మెల్యేలు అసభ్యంగా మాట్లాడటం దారుణమన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం, గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండు చేశారు. కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని రాబోయే రెండు నెలల్లో ఇంటికి పంపడానికి ఉద్యోగ, కార్మికులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, పట్టణ నాయకులు వేలన్, బాషా, రూప్‌కుమార్, విజయకుమార్, మురళి, శేఖర్, సతీష్, సుబ్రమణ్యం, ఏసుదాసు, మురగమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొంగాటంలో బంగారు ఆభరణాల చోరీ

వి.కోట, జనవరి 8: వి.కోట మండలం కొంగాటంలోని సుబ్రమణ్యం ఇంట్లో బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఆయన చిన్న కుమారుడు సోమవారం మధ్యాహ్నం కుప్పం కాలేజి నుంచి ఇంటికి చేరుకున్న ఆయన చిన్న కుమారుడు విశ్వనాథ్ ఇంటి తలుపులు తెరచిఉండడంతో వెళ్ళి చూడగా లోపల బంగారు ఆహరణాల పెట్టెలు చిందరవందరగా పడిఉన్నాయి. దీంతో అతను కుటుంబసభ్యులకు ఫోన్ చేయగా వ్యవసాయ పనులకు వెళ్ళిన వారు ఇంటికి చేరుకుని చోరీ జరిగినట్లు గుర్తించారు. తక్షణం చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ లింగప్ప సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని చోరీపై విచారణ చేపట్టారు. ఏడాది క్రితం సుబ్రహణ్యం పెద్ద కుమారుడు లోకేష్‌కు వివాహం జరిగింది. అతడికి చెందిన ఆభరణాలు ఇంట్లో ఉంచి, వారు బెంగళూరులో ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తూ అక్కడే ఉంటుండగా, గ్రామంలో సుబ్రమణ్యం, అతడి భార్య రత్నమ్మ, చిన్నకుమారుడు ఉంటున్నారు. వ్యవసాయ పనులకు వెళ్ళేప్పుడు ఇంటికి తాళం వేసి ఓ చోట ఉంచి వెళ్ళే వారమని, సోమవారం యథాప్రకారం వెళ్ళగా, ఎవరో కనిపెట్టి దాచి ఉంచిన తాళం తీసి చోరీ చేసినట్లు బాధితులు పోలీసులకు తెలిపారు. సుమారు 150 గ్రాముల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, కొంత నగదు చోరీ అయినట్లు ఫిర్యాదు చేశారు. చిత్తూరు నుంచి క్లూస్ టీం ఈ గ్రామానికి చేరుకుని వేలిముద్రలు సేకరించారు. పల్లెకు ఎవరైనా కొత్త వ్యక్తులు వచ్చి వెళ్ళారా..? లేక ఇక్కడి వారే చోరీకి పాల్పడ్డారా..? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఏడుగురు స్మగ్లర్ల అరెస్ట్

● వాహనం సహా ఎర్రచందనం దుంగలు స్వాధీనం

పీలేరు, జనవరి 8: తమిళనాడుకు చెందిన ఏడుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి వాహనంతో సహా ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్ఆర్‌వో వెంకటరమణ తెలిపారు. ఆయన కథనం మేరకు... సానిపాయ అటవీ ప్రాంతం నుంచి పీలేరు మీదుగా తమిళనాడుకు ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతున్నట్లు తమకు రహస్య సమాచారం అందిందన్నారు. దీంతో తాము ఆదివారం రాత్రి పీలేరు సమీపంలోని ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 3 గంటల ప్రాంతంలో అటువైపు వేగంగా వచ్చిన ఏపీ28 బీవీ 6370 నెంబరు గల ఫోర్డ్ ఫీస్టా వాహనం తాము ఆపినా ఆపకుండా ఆగకుండా చిత్తూరు వైపు వెళ్లిపోయిందన్నారు. అనుమానంతో తాము దానిని వెంబడించగా అశోక్ నగర్ కాలనీ వద్ద కారు డ్రైవర్, మరో వ్యక్తి కారులో నుంచి పారిపోయారన్నారు. కారులో ఉన్న తమిళనాడుకు చెందిన వేలురత్నం, శక్తివేలు, రామదొరై ఈశ్వరన్, కుప్పన్, నగేషన్ అరుణాచలం, విజయకుమార్, శ్రీనివాస పెరియ పయన్‌లను తాము అదుపులోకి తీసుకుని కారును తనిఖీ చేయగా అందులో 370 కిలోల బరువున్న 12 ఎర్రచందనం దుంగలు దొరికాయన్నారు. అదుపులోకి తీసుకున్న వారిని విచారించగా పారిపోయిన వారిలో ఎర్రచందనం కూలీలకు మేస్త్రీగా వ్యవహరించే తమిళనాడు రాష్ట్రం, జమునా పుత్తూరుకు చెందిన మురుగేషన్‌గా గుర్తించామన్నారు. డ్రైవర్ ఆచూకీ తెలియాల్సి ఉందన్నారు. దాడిలో తనతో పాటు ఎఫ్‌బీవో ప్రతాప్, సిబ్బంది ప్రభుతేజ, చరణ్, సుబ్రహ్మణ్యం, మల్లికార్జున పాల్గొన్నట్లు వెంకటరమణ తెలిపారు.

కథలకు ఆహ్వానం

చిత్తూరు కల్చరల్, జనవరి 8: కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కారాలకు వర్ధమాన రచయితల నుంచి కథల సంపుటిలు, నవలలు, చందోబద్ధ, వచన కవితలను ఆహ్వానిస్తున్నట్లు పురస్కారాల ప్రదాతలు డాక్టర్ కె.రామలక్ష్మి, రోజాప్రియ, నిరంజన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన రచయితలు, కవులు మాత్రమే తమ రచనలను ఈనెల 31వ తేదీలోపు 'డాక్టర్ కె.రామలక్ష్మి, రామలక్ష్మి నర్సింగ్‌హోమ్, సుందరయ్యవీధి, చిత్తూరు-517001' చిరునామాకు పంపాలని కోరారు. ఏప్రిల్ 17న శ్రీరామ నవమి సందర్భంగా చిత్తూరులో నిర్వహించే కార్యక్రమంలో విజేతలకు పురస్కారాలను ప్రదానం చేస్తామని పేర్కొన్నారు.

ఆమోదయోగ్యమైన చోట ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

తిరుపతి (రవాణా), జనవరి 8: ఎన్టీఆర్ విగ్రహాన్ని అందరికీ ఆమోదయోగ్యమైన చోట ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ ఛైర్మన్ నరసింహయాదవ్ కోరారు. సోమవారం రాత్రి వారు మున్సిపల్ అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. తిమ్మినాయుడుపాళెం వద్ద ఎన్టీఆర్ విగ్రహాన్ని తొలగించడానికి ప్రయత్నాలు చేయగా టీడీపీ నేతలు, ఎన్టీఆర్ అభిమానులు అడ్డుకుని సోమవారం కమిషనర్ హరితను కలిసి సమస్యను వివరించారు. ఆమె ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు విగ్రహ ఏర్పాటుకు టీడీపీ నాయకులతో కలిసి స్థల పరిశీలన చేశారు. విగ్రహాన్ని సెంటర్‌లోనే ఏర్పాటు చేయాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, బుల్లెట్ రమణ, బ్యాంకు శాంతమ్మ, ఖాయం వెంకటరత్నం, విజయ్, నరేష్‌రెడ్డి, ధోని పాల్గొన్నారు.

ఎన్నికలు వస్తేనే బలిజలు గుర్తుకొస్తారా?



సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డిశేఖర్ రాయల్

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 8: రాష్ట్రంలో ఎన్నికలు వచ్చినపుడు మాత్రమే రాజకీయ పార్టీలకు బలిజలు గుర్తుకు వస్తారా అని రాయల్ పీపుల్ ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు రెడ్డిశేఖర్ రాయల్ ప్రశ్నించారు. తమకు ఏం మంచి చేశారో చెప్పి ఎన్నికలకు పోవాలని డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బలిజలను ఓటర్లుగా వాడుకుని వదిలేసే పార్టీలను ఓడించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా శ్రీకృష్ణ దేవరాయల విగ్రహాలతో రాజకీయాలకు శ్రీకారం చుట్టారని, బలిజ భవనాల నిర్మాణాలకు కేటాయించిన భూమిని అధికార పార్టీ నేతలు కబ్జా చేశారని ఆరోపించారు. వీటన్నింటినీ ఐకమత్యంతో ఎదుర్కోవాలని కోరారు. గుణశేఖర్, వేణు రాయల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ చిత్తూరు పార్లమెంటు ఎన్నికల సమన్వయకర్తగా రాంభూపాల్‌రెడ్డి



తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 8 : కాంగ్రెస్ పార్టీ చిత్తూరు పార్లమెంటు ఎన్నికల సమన్వయకర్తగా ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొడ్డారెడ్డి రాంభూపాల్‌రెడ్డిని నియమించారు. ఆయన మాట్లాడుతూ తనకు అవకాశం ఇచ్చిన పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. అప్పగించిన పనిని దిగ్విజయంగా పూర్తి చేస్తానని పేర్కొన్నారు.

అంబేడ్కర్ జీవితం స్ఫూర్తిదాయకం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 8: అంబేడ్కర్ జీవితం స్ఫూర్తిదాయకమని విద్యార్థులు అన్నారు. విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరించనున్న సందర్భంగా పద్మావతి మహిళా యూనివర్సిటీలో సోమవారం అంబేడ్కర్ జీవితంపై విద్యార్థులకు చర్చాగోష్ఠి నిర్వహించారు. పలు విభాగాలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు.

వర్క్‌షాప్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 8 : జాతీయ హెల్తీ విలేజ్ థీమ్ జాతీయ వర్క్‌షాప్ విజయవంతానికి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై రెండవ థీమ అయిన ఆరోగ్యకరమైన గ్రామ అంశంపై జాతీయ వర్క్‌షాప్‌పై సోమవారం విజయవాడ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి వర్చువల్ విధానంలో పలు సూచనలు చేశారు. కలెక్టరేట్ నుంచి జేసీ శుభం బన్సల్, పంచాయతీరాజ్ జాయింట్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, డీఆర్వో పెంచలకిషోర్, డీపీవో రాజశేఖర్ రెడ్డి హాజరై ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

రైల్వేలో ఓపీఎస్ అమలు చేయాలి



తిరుపతి రైల్వే స్టేషన్ వద్ద రిలే దీక్షలు చేస్తున్న ఎంప్లాయిస్ సంఘ నాయకులు

తిరుపతి(ఆటోనగర్) జనవరి 8 : రైల్వేలో ఉద్యోగులకు, కార్మికులకు పాత పింఛను విధానం అమలు చేయాలని రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ తిరుపతి శాఖ నాయకులు పి.జయకుమార్, రహమతుల్లా డిమాండ్ చేశారు. ఈ మేరకు తిరుపతి రైల్వేస్టేషన్ ఎదుట సోమవారం వారు రిలే దీక్షలను ప్రారంభించారు. రైల్వే ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించకపోవడం అన్యాయమన్నారు. ఈ ఆందోళనలో రైల్వే కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.ఎస్.వి.రెడ్డి, టివికెఎస్. గిరీష్, దర్బార్‌రెడ్డి, ఆనంద్‌బాబు, చంద్రకాంత్, సోమశేఖర్, పెంచలయ్య, మునిశేఖర్ పాల్గొన్నారు.

నా భర్త ఎక్కడో చెప్పండి



మాట్లాడుతున్న మంజుల

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 8: విచారణ పేరుతో తీసుకెళ్లిన తన భర్తను పోలీసులు ఏమి చేశారో చెప్పాలని రేణిగుంట జ్యోతినగర్‌కు చెందిన మంజుల డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ ఇటీవల పాపానాయుడుపేటలో జరిగిన ఓ చోరీ కేసుకు సంబంధించి పోలీసులు విచారణ పేరుతో డిసెంబరు 30న తన భర్తను తీసుకెళ్లారని, పది రోజులు కావస్తున్నా ఆయన్ను ఏమి చేశారో చెప్పడం లేదని అన్నారు. ఏర్పేడు పోలీస్‌స్టేషన్‌లో తన భర్త ద్విచక్ర వాహనం ఉందని, ఆయన ఎక్కడున్నాడో చెప్పాలని అడిగితే సీఐ, కానిస్టేబుల్ ఒకరిపై ఒకరు చెప్పుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. గతంలో ఒక కేసులో నిందితుడిగా ఉన్న తన భర్తపై లేనిపోని నిందలు మోపేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించింది. నిజంగా అయన తప్పుచేసి ఉంటే కోర్టుముందు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేసింది. ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని కోరింది.

తిరుపతి

మోస్తరు వర్షం

నగరంలో పెరిగిన చలి తీవ్రత



తిరుపతి(కొర్లగుంట), జనవరి 8 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడన ద్రోణి ప్రభావంతో తిరుపతిలో సోమవారం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం 8గంటల నుంచి ప్రారంభమైన వాన మధ్యాహ్నం వరకు కురిసింది. పిల్లలు పాఠశాలలకు వెళ్లేందుకు, ఉద్యోగులు కార్యాలయాలకు చేరుకునేందుకు, కూలీలు వారు పనిచేసే చోటికి వెళ్లడానికి ఇబ్బంది పడాల్సి వచ్చింది. నగర వీధుల్లో నీరు ప్రవహించింది. రోడ్లు తవ్వేసిన ప్రాంతాలు చిత్తడిగా మారాయి. వ్యాపార స్థలాలు, మార్కెట్, బస్టాండులో ప్రజలు తడుస్తూ కనిపించారు. వర్షంతో పాటు చలి పెరగడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. మూడు రోజులుగా మేఘాలు దట్టంగా కమ్ముకుని, పగటిపూట ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. చలి పెరిగింది. రాత్రిపూట తీవ్రత పెరిగి వణికిస్తోంది. మరోవైపు శేషాచల అడవులను మేఘాలు కప్పేయడం, మాల్వాడిగుండం, కపిలతీర్థం జలపాతాలు జాలువారుతుండడం కనువిందు చేస్తున్నాయి. శ్రీనివాససేతుపై ప్రయాణించేవారు పొగమంచు చాటున నగర అందాలను చూస్తూ మురిసిపోతున్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయండి



తిరుపతి(ఆటోనగర్)జనవరి 8 : సీఎం జగన్ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు పర్మినెంట్ చేస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. ఈ మేరకు తిరుపతి సదరన్ డిస్కం కార్యాలయం ఎదుట సోమవారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. మురళి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి నాలుగున్నరేళ్లు గడుస్తున్నా పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. కార్మికుల శ్రమను దోచి కాంట్రాక్టర్లకు, కార్పొరేటర్లకు దోచిపెడుతున్న వైసీపీ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. వినియోగదారులపై ఎనిమిదిసార్లు విద్యుత్ చార్జీల భారం మోపిన ప్రభుత్వం కాలగర్భంలో కలిసిపోతుందన్నారు. అనంతరం సీఎండీ కె.సంతోషరావుకు వినతిపత్రం అందజేశారు. తన పరిధిలోని సమస్యలను పరిష్కరించి, మిగిలినవి ప్రభుత్వానికి విన్నవిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్, ఆరోగ్యదాస్, నారాయణ, ఖాధిర్, సుదర్శన్‌బాబు, ప్రసాద్, రవికుమార్, చిరంజీవి, మురళి, సోము, భార్గవ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.83 కోట్లు

తిరుమల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.83 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 76,058 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 22,543 మంది తలనీలాలు సమర్పించారు.

వెంకన్న సేవలో ప్రముఖులు



రాఘవేంద్రరావు - కనకయ్య - వెంకటరమణారెడ్డి

తిరుమల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో ప్రముఖ సినీ దర్శకుడు రాఘవేంద్రరావు, తెలంగాణ ఎమ్మెల్యే కనకయ్య, కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

తిరుమలలో వృద్ధురాలి మృతి



ప్రేమ్‌కాంత మేతి మృతదేహం

తిరుమల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన ఓ వృద్ధురాలు హఠాత్తుగా మృతిచెందింది. జైపూర్‌కు చెందిన ప్రేమ్‌కాంత మేతి(71) శ్రీవారి దర్శనం కోసం కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం తిరుమలకు వచ్చింది. హరహర భయంకర మఠంలో బస పొందారు. గదిలో విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో ప్రేమ్‌కాంత మేతి ఉలుకుపలుకు లేకుండా ఉండటాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన అశ్విని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. వయస్సు కారణాలతో ఆమె మృతిచెంది ఉండవచ్చని కుటుంబ సభ్యులు అభిప్రాయపడ్డారు.

ఎంసీఏ ఫలితాల్లో రిమ్స్ విద్యార్థుల విజయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రకాశ్‌రెడ్డి

తిరుపతి(విద్య), జనవరి 8: ఎస్వీయూ విడుదల చేసిన ఎంసీఏ ఫలితాల్లో బైరాగిపట్టెడలోని కొండారెడ్డి రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్ కళాశాల(రిమ్స్) విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రథమ సెమిస్టర్‌లో తమ విద్యార్థులు ఎం.గోపిక 8.55జీపీఏ, ఎస్.సుకన్య 8.53, బి.మణికంఠ 8.47, పి.శ్రావణి 8.28, మేఘన 8.26జీపీఏ మార్కులతో, మూడవ సెమిస్టర్‌లో ఎస్.శ్రావణి 8.48, కె.సుధా 8.47, ఎస్.అక్బర్ 8.37, మిస్బానవాజ్ 8.36, వెంకటభావన 8.32జీపీఏ మార్కులతో టాపర్స్‌గా నిలిచారని వివరించారు. కాగా ప్రిన్సిపాల్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం విద్యార్థిని ఎం.గోపికకు నగదు బహుమతి అందజేశారు. విద్యార్థులను చైర్మన్ వై.కొండారెడ్డి, డైరెక్టర్లు వై.ఆనందరెడ్డి, వై.విజయ్‌రెడ్డి, ఎంసీఏ హెడ్ పి.మధుర, ఎంబీఏ హెడ్ డాక్టర్ పి.నిరంజన్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

ఏపీ ఫారెస్ట్ ఆఫీసర్స్ రాష్ట్ర అధ్యక్షుడిగా లక్ష్మీపతి



తిరుపతి అర్బన్, జనవరి 8: ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ రాష్ట్ర అధ్యక్షుడిగా తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్ఆర్వో లక్ష్మీపతి ఎన్నికయ్యారు. విజయవాడలో ఏపీ ఫారెస్ట్‌రేంజ్ ఆఫీసర్స్ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా పీలేరు డీఎఫ్‌వో జేవీ సుబ్బారెడ్డి, విజయవాడ డీఎఫ్‌వో రవిశంకర్‌శర్మ వ్యవహరించారు. జనరల్ సెక్రటరీగా విజయవాడ ఎఫ్ఆర్వో కె.శ్రీనివాసులురెడ్డి, కోశాధికారిగా విశ్వేశ్వరయ్య, సంయుక్త కార్యదర్శిగా ఏ.సౌజన్య, వైస్ ప్రెసిడెంట్‌గా రాయలసీమ టి.ప్రభాకర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్వీకే కుమార్, రీజనల్ సెక్రటరీ(రాయలసీమ)గా అశోక్‌యాదవ్, రీజనల్ సెక్రటరీ(ఆంధ్రా)గా ఆర్.రాజాబాబు, అదనపు జాయింట్ సెక్రటరీగా పి.శ్రీనివాసరావు ఎన్నికయ్యారని ఎన్నికల అధికారులు ప్రకటించారు. నూతన అధ్యక్షుడు లక్ష్మీపతిని పలువురు అభినందించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



తిరుపతి(కొర్లగుంట), జనవరి 8: ఏపీ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం తిరుపతి శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్‌ను సోమవారం జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన్ను సన్మానించారు. సంఘం తిరుపతి శాఖ అధ్యక్షుడు చెంగల్‌రాయులు, ఉపాధ్యక్షులు మైకేల్, గూబరాజు ఏకాంబరం, సురేష్, కోశాధికారి ఎం.ధనుంజయలు, సభ్యులు సురేష్‌నాయక్, భీమ్లానాయక్, శ్రీనివాసులు, మోహన్, రఘు, తులసీరామ్ పాల్గొన్నారు.

నా కుమారుడి ఆచూకీ తెలిస్తే చెప్పండి



తులసీరామ్

తిరుపతి(విద్య), జనవరి 8: తన కుమారుడు వై.తులసీరామ్(15) ఆచూకీ తెలిస్తే సంప్రదించాలని స్థానిక విశాలాంధ్ర రోడ్డులో నివసించే వై.వెంకటేష్ కోరుతున్నారు. పదవ తరగతి చదువుతున్న తన కుమారుడు ఈనెల ఒకటో తేదీ ఇంటి నుంచి పారిపోయారని, ఇదే విషయమై రెండో తేదీన అలిపిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని ప్రకటించారు. వివరాలు తెలిసిన వారు 9573440521, 9052937742లను సంప్రదించాలని ప్రకటనలో కోరారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

తిరుపతి(లీగల్), జనవరి 8 : ఓ వ్యక్తిని హతమార్చిన తమిళనాడు వేలూరుకు చెందిన బాలకృష్ణభాస్కర్‌కు జీవితఖైదుతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తిరుపతి పదవ అదనపు జిల్లా న్యాయమూర్తి రామచంద్రుడు సోమవారం తీర్పు చెప్పారు. 2022 జూలై 21న తమిళనాడుకు చెందిన కందస్వామిశ్రావణ్‌తో బాలకృష్ణ భాస్కర్ గొడవపడ్డారు. తిరుమల కాలినడక షెడ్డులో నిద్రిస్తున్న సమయంలో సిమెంట్ ఇటుకతో తలపై మోది కందస్వామి శ్రావణ్‌ను చంపేశాడు. నిందితుడిని తిరుమల వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని, కోర్టులో హాజరుపరిచారు. కేసు నిరూపణ కావడంతో ఈ మేరకు శిక్ష విధించారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న శుభం బన్సల్ - అధికారులు లేకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

సమస్యలకు పరిష్కారం చూపండి స్వామీ..!

- స్పందనలో అధికారుల ఎదుట అర్జీదారుల ఆవేదన
- కలెక్టరేట్‌కు అందిన 201 ఫిర్యాదులు
- సగం మంది అధికారుల డుమ్మా

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 8 : 'నెలల తరబడి కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాం.. అర్జీలు ఇస్తున్నాం.. మా సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు.. మాపై దయ చూపండి' అంటూ అర్జీదారులు అధికారుల ఎదుట వాపోయారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందనకు 201 ఫిర్యాదులు వచ్చాయి. అత్యధికంగా రెవెన్యూ శాఖకు 169 అందాయి. ప్రజల నుంచి జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో పెంచలకిషోర్, ఇతర అధికారులు అర్జీలు స్వీకరించారు. వర్షం సాకుగా చూపి చాలామంది జిల్లా అధికారులు స్పందనకు డుమ్మా కొట్టడం విమర్శలకు తావిచ్చింది. స్పందన అర్జీలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి నిర్ణీత సమయం లోపు పరిష్కరించాలని అధికారులను జేసీ ఆదేశించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీనివాస్, భవానీశంకర్, భాస్కర్‌నాయుడు, కలెక్టరేట్ ఏవో జయరాములు పాల్గొన్నారు.

వికలాంగ పింఛను కోసం మూడేళ్లుగా తిరుగుతున్నా..



అయ్యా మాది కరకంబాడీలోని తారకరామనగర్. మూడేళ్ల క్రితం షుగర్ వ్యాధి వచ్చి ఎడమకాలు తొలగించారు. అప్పటి నుంచి కూలి పనులకు వెళ్లలేకపోతున్నా. కుటుంబ పోషణ కష్టంగా ఉంది. వికలాంగ పింఛను కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నా అధికారులు ఏమాత్రమూ కనికరించడం లేదు. మీరైనా స్పందించి పింఛను ఇప్పించండి.

- అల్లీబాషా, కరకంబాడి

వితంతు పింఛను ఇప్పించండి సారూ..!



సార్ మాది పుత్తూరు మండలం, కల్యాణపురం ఎస్టీకాలనీ. నా భర్త అల్లూరయ్య ఒకటిన్నర సంవత్సరం క్రితం మరణించాడు. అప్పటి నుంచి కుటుంబం దిక్కులేని స్థితిలో పడిపోయింది. వితంతు పింఛను కోసం దరఖాస్తు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. సచివాలయానికి వెళ్లినా లాభం లేకపోయింది. మీరైనా న్యాయం చేయండి.

- సుజాత, కల్యాణపురం, పుత్తూరు మండలం

లోన్ ఇప్పిస్తానని భూమిని అమ్మేశాడు



ఎంపేడు గ్రామంలోని సర్వే నెం.201/1లో 1.60ఎకరాల భూమిని ప్రభుత్వం నా భర్త అంకీస పేరుతో పట్టా ఇచ్చింది. దానిపై రుణం ఇప్పిస్తానని మా గ్రామానికి చెందిన లింగయ్య పట్టా పాసుపుస్తకం, భూమికి సంబంధించిన రికార్డులు తీసుకెళ్లాడు. రుణం తీసివ్వకపోగా భూమికి సంబంధించిన రికార్డులు ఇవ్వమంటే సమాధానం చెప్పకుండా వేధిస్తున్నాడు. మా భూమిని అమ్మినట్లు, పట్టా రద్దు చేసినట్లు తెలిసింది. మాకు న్యాయం చేయండి.

- జ్ఞానమ్మ, షికారీ, ఎంపేడు, శ్రీకాళహస్తి మండలం

కబ్జా కోరల నుంచి కళాశాల స్థలాన్ని కాపాడండి



డీఆర్వోకు వినతిపత్రమిస్తున్న చక్రాల ఉష

తొట్టంబేడు ప్రభుత్వ బాలికల కళాశాల స్థలాన్ని కబ్జాదారుల కోరల నుంచి కాపాడాలని తెలుగు మహిళ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షురాలు చక్రాల ఉష విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఆమె స్పందనలో డీఆర్వో పెంచలకిషోర్‌కు వినతిపత్రం ఇచ్చారు. 1996లో కళాశాల కోసం గతంలో అయ్యలనాడు చెరువు పరిధిలో సర్వే నెంబరు 185/12లో 6.67 ఎకరాలను ప్రభుత్వం కేటాయించిందన్నారు. నాబార్డు నిధులతో భవనాలను నిర్మించారని తెలిపారు. 250 మంది విద్యార్థినులు చదువుతున్న ఈ కళాశాల స్థలాన్ని కొందరు అధికార పార్టీ నాయకులు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, రాత్రికి రాత్రే నిర్మాణాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రిన్సిపాల్ సుధాకర్ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. స్పందించిన డీఆర్వో పెంచలకిషోర్ విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టాలి



స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రమిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టి వలసలు, కరువు నివారణ చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నేతలు కోరారు. ఈ మేరకు అధికారులకు వినతిపత్రం అందజేశారు. నాయకులు సీహెచ్ ప్రభాకర్, తులసీరాజన్, చిన్నం కాళయ్య, శివకుమార్, రుద్రపాక శ్రీనివాసులు, బాలయ్య, అంకయ్య, చంద్ర, డిల్లీ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులందరికీ ఇళ్ల పట్టాలిచ్చాం : భూమన



టీటీడీ ఉద్యోగులకు ఇంటి పట్టాలు అందజేస్తున్న చైర్మన్ భూమన, ఈవో ధర్మారెడ్డి

తిరుపతి (కల్చరల్), జనవరి 8: టీటీడీ ఉద్యోగులందరికీ ఇంటి పట్టాలు ఇచ్చామని పాలకమండలి అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం మహతి ఆడిటోరియంలో టీటీడీ ఉద్యోగులకు రెండవ విడత ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తన చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. మూడవ విడతలో విశ్రాంత ఉద్యోగులకు, మిగిలిన ఉద్యోగులకు ఇవ్వడానికి భూమి సేకరిస్తున్నామన్నారు. సహకరించిన ముఖ్యమంత్రి జగన్‌కు, టీటీడీ ఈవో ధర్మారెడ్డికి, కలెక్టర్ వెంకట్రమణారెడ్డికి, జేఈవోలు సదాభార్గవి, వీరబ్రహ్మంకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈవో ధర్మారెడ్డి మాట్లాడుతూ ఇంటి స్థలాల విషయంలో ఉద్యోగులు ఎటువంటి అపోహలకూ గురికావద్దని, ప్రభుత్వ భూమిని టీటీడీ కొనుగోలు చేసి ఇస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో జేఈవోలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహ కిశోర్, డిఎల్వో వీర్రాజు, సీఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తిరుమలలో హీరో సుధీర్ బాబు



తిరుమల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : శ్రీవారి దర్శనార్థం సినీ హీరో సుధీర్‌బాబు సోమవారం తిరుమలకు వచ్చారు. తిరుమలలోని కావేరి విశ్రాంతి భవనానికి చేరుకున్న ఆయనకు స్థానిక అభిమానులు స్వాగతం పలికారు. మంగళవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

ఎస్వీయూ వీసీకి అభినందన



తిరుపతి(విద్య), జనవరి 8 : ఎస్వీయూ వీసీగా నియమితులైన ప్రొఫెసర్ వి.శ్రీకాంత్‌రెడ్డిని సోమవారం తిరుపతికి చెందిన ఎస్డీహెచ్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాల చైర్మన్ డీవీఎస్ చక్రవర్తిరెడ్డి మర్యాదపూర్వకంగా కలసి దుశ్శాలువా, పుష్పగుచ్ఛంతో అభినందించారు.

టీటీడీ ఆలయాల సమాచారంతో కొత్త వెబ్‌సైట్

తిరుపతి (కల్చరల్), జనవరి 8: తిరుపతి, ఇతర ప్రాంతాల్లోని టీటీడీ అనుబంధ ఆలయాలకు సంబంధించిన పూర్తి సమాచారంతో కొత్త వెబ్‌సైట్ (ttdevasthanams.ap.gov.in)ను టీటీడీ సోమవారం ప్రారంభించింది. మహతి వేదికగా టీటీడీ పాలకమండలి అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి దీన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఇందులో 60 ఆలయాలకు సంబంధించి స్థల పురాణం, దర్శనం, పూజాదికాల వేళలు, రవాణా, వసతి, ఆర్జిత సేవల వివరాలు పొందుపరిచామని భూమన తెలిపారు. ఈ ఈవో ధర్మారెడ్డి,జేఈవోలు సదాభార్గవి, వీరబ్రహ్మం పాల్గొన్నారు.

సంక్షేమాల పేరుతో రాష్ట్రం సంక్షోభంలోకి..: టీడీపీ



మీడియాతో మాట్లాడుతున్న నరసింహ యాదవ్

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 8 : వైసీపీ ప్రభుత్వం సంక్షేమాల పేరుతో రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టేసిందని టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్ విమర్శించారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ వైసీపీ విధానాలతో రాష్ట్రంలో రైతులు, యువత భవిత ప్రశ్నార్థకంగా మారిందన్నారు. రైతుల ఆత్మహత్యల్లో మూడవ స్థానంలోకి తెచ్చారని ఎద్దేవా చేశారు. పోలవరం ప్రాజెక్టును చంద్రబాబు 70శాతం పూర్తి చేస్తే 30శాతం పనులను కూడా చేయలేకపోయారన్నారు. కల్తీ మద్యం ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. గంజాయి విక్రయాలు యువత భవిష్యత్తును చీకటిమయం చేస్తున్నామని పేర్కొన్నారు. వైసీపీ ఒక సీటు కూడా గెలిచే పరిస్థితి లేదని సర్వేలు చెబుతున్నాయన్నారు. టీడీపీ కార్పొరేటర్ ఆర్‌సీ మునికృష్ణ, నాయకులు శ్రీధర్ వర్మ, వూకా విజయకుమార్, కుమారమ్మ మనోహర్ ఆచారి, బసవయ్య పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేయాలి



న్యాయవాదుల దీక్షకు మద్దతు తెలుపుతున్న టీడీపీ నేతలు

తిరుపతి(లీగల్), జనవరి 8 : ఏపీ ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను వెంటనే రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ డిమాండ్ చేశారు. తిరుపతి కోర్టు ప్రాంగణంలో తిరుపతి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.వెంకటకుమార్ అధ్యక్షతన తిరుపతి కోర్టు ప్రాంగణంలో సోమవారం న్యాయవాదులు ల్యాండ్ టైటిల్ యాక్ట్‌కు నిరసనగా రిలే నిరాహారదీక్షకు దిగారు. దీక్షకు తెలుగుదేశం పార్టీ నాయకులు మద్దతు ప్రకటించారు. సుగుణమ్మ మాట్లాడుతూ ప్రజల ఆస్తులను హరించేలా చీకటి చట్టాలు చేశారని ధ్వజమెత్తారు. తాము అధికారంలోకి రాగానే ఈ చట్టాన్ని రద్దు చేస్తామని టీడీపీ జాతీయ కార్యదర్శి లోకేశ్ ఇప్పటికే హామీ ఇచ్చారని గుర్తు చేశారు. పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు దృష్టికి తీసుకెళతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్, మునికృష్ణ, శ్రీధర్‌వర్మ, ఊకా విజయ్‌కుమార్, మనోహరాచారి, సీనియర్ న్యాయవాదులు కంచి ప్రకాశం, కొంగర పార్థసారథి, దినకర్, వేణుగోపాల్, నెల్లూరు యోగానంద్, ఉమాపతి, గాజుల కృష్ణయ్య, రాజేంద్ర, ప్రతాప్, శంకర్, మధుబాబు, మాసి కృష్ణయ్య, శంకర్‌రెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వర్షంలోనూ ఎస్ఎస్ ఉద్యోగుల సమ్మె



వర్షంలో గొడుగులు వేసుకుని సమ్మె చేస్తున్న ఎస్ఎస్ ఉద్యోగులు

తిరుపతి(విద్య), జనవరి 8 : కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ తిరుపతిలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద సమగ్రశిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె సోమవారం 20వ రోజుకు చేరుకుంది. ఉదయం జోరు వర్షంలోనూ గొడుగులు వేసుకుని ఉద్యోగులు సమ్మెను కొనసాగించారు. వారు మాట్లాడుతూ సమగ్రశిక్షలోని అన్ని విభాగాల ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీని నిర్ణయించాలని, 62ఏళ్ల కాలానికి ఉద్యోగ విరమణ చేయాలని, రెగ్యులరైజ్ చేయాలని, సకాలంలో జీతాలు అందించాలని కోరారు. ఈ సమ్మెలో 34మండలాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

టైక్వాండో అసోసియేషన్ నూతన కార్యవర్గం



చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న నూతన కార్యవర్గ ప్రతినిధులు

తిరుపతి(విద్య), జనవరి 8: ఆర్‌సీ రోడ్డులోని టైక్వాండో అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా టైక్వాండో కార్యవర్గ సమావేశం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఇందులో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ప్రకటించారు. అధ్యక్షుడిగా టి.ధనంజయులు, వైస్ ప్రెసిడెంట్లుగా డి.క్రాంతికుమార్, కె.వెంకటరమణాచారి, ప్రధాన కార్యదర్శిగా ఎ.మనోహరనాయుడు, సంయుక్త కార్యదర్శులుగా సి.రామనన్, సి.శంకర్, కోశాధికారిగా బి.శ్రీనివాసులు, ఈసీసభ్యులుగా బీఎస్ అరుణ్, ఎం.సంతోష్, వి.కిరణ్, ఎ.కోదండం, సీఆర్ హర్షితను ఎన్నుకున్నారు. కాగాసంఘ ఆధ్వర్యంలో ఈనెల 17న చిత్తూరులో సబ్ జూనియర్ టైక్వాండో జిల్లాస్థాయి పోటీలను నిర్వహించాలని తీర్మానించామని ప్రకటించారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ క్రీడాకారులకు మెరుగైన శిక్షణ, సదుపాయాలు కల్పించేందుకు తనవంతు సహకారం అందిస్తామని తెలిపారు.

వైసీపీని ఊడ్చి గంగలో వేస్తారు

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శ



నగరిలో మున్సిపల్ కార్మికులతో కలిసి సమ్మెలో పాల్గొన్న నారాయణ

నగరి, జనవరి 8: అంగన్వాడీ కార్యకర్తలు, పారిశుధ్య కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకుంటే వైసీపీ ప్రభుత్వాన్ని ఊడ్చి గంగలో వేస్తారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ హెచ్చరించారు. నగరి మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం జరిగిన సమ్మెలో ఆయన పాల్గొన్నారు. పారిశుధ్య పనులు చేస్తూ ప్రజలను అనారోగ్యం నుంచి కాపాడే కార్మికులు రోడ్డెక్కి ధర్నా చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. తమ న్యాయమైన కోర్కెల సాధన కోసం పోరాడుతున్న వారి విషయంలో ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా ఉండటాన్ని ఖండిస్తున్నట్లు చెప్పారు. అంగన్వాడీ కార్యకర్తలు 27 రోజులుగా సమ్మె చేస్తున్నా వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోగా ఎస్మా చట్టాన్ని తేవడంతో ప్రభుత్వం తన గొయ్యిని తానే తవ్వుకున్నట్లయిందన్నారు. మహిళా కార్మికులని కూడా చూడకుండా మంత్రులు, ఎమ్మెల్యేలు అసభ్యంగా మాట్లాడటం దారుణమన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం, గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండు చేశారు. కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని రాబోయే రెండు నెలల్లో ఇంటికి పంపడానికి ఉద్యోగ, కార్మికులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, పట్టణ నాయకులు వేలన్, బాషా, రూప్‌కుమార్, విజయకుమార్, మురళి, శేఖర్, సతీష్, సుబ్రమణ్యం, ఏసుదాసు, మురగమ్మ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

తిరుపతి(లీగల్), జనవరి 8: ఓ వ్యక్తిని హతమార్చిన తమిళనాడు వేలూరుకు చెందిన బాలకృష్ణభాస్కర్‌కు జీవితఖైదుతో పాటు రూ. వెయ్యి జరిమానా విధిస్తూ తిరుపతి పదవ అదనపు జిల్లా న్యాయమూర్తి రామచంద్రుడు సోమవారం తీర్పు చెప్పారు. 2022 జూలై 21న తమిళనాడుకు చెందిన కందస్వామిశ్రావణ్‌తో బాలకృష్ణ భాస్కర్ గొడవపడ్డారు. ఈ క్రమంలో తిరుమల కాలినడక షెడ్డులో నిద్రిస్తున్న సమయంలో సిమెంట్ ఇటుకతో తలపై మోది కందస్వామి శ్రావణ్‌ను బాలకృష్ణ భాస్కర్ చంపేశాడు. నిందితుడిని తిరుమల వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని, కోర్టులో హాజరుపరిచారు. కేసు నిరూపణ కావడంతో శిక్ష విధించారు.

కలెక్టరేట్‌ను ముట్టడించిన మున్సిపల్ కార్మికులు


కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 8: తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. వెంకటగిరి, గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట మున్సిపల్ కార్మికులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు 14రోజులుగా సమ్మె చేస్తున్నా వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పూనుకోకపోవడం బాధాకరమన్నారు. పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ కార్మికులకు రిస్క్ అలవెన్స్, 11వ పీఆర్సీ ప్రకారం జీతాలు ఇవ్వాలన్నారు. మరో మూడేళ్ల రూపాయి కూడా జీతాలు పెంచడం జరగదని చెప్పడం కార్మికులను అవమానపరిచేదిగా ఉందని పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించకపోగా కార్మికులపై దాడులకు గూండాలను ఉసిగొల్పుతున్నారన్నారు. మద్దతు తెలుపుతున్న సీఐటీయూ నాయకులపై బైండోవర్ కేసులు పెట్టడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ ఆర్.లక్ష్మి, సీఐటీయూ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపి, పద్మనాభం వడ్డిపల్లి చెంగయ్య, చాలప వెంకటేశ్వర్లు, సుబ్బన్న, లక్ష్మి, ప్రభావతి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్ఐ పరిశోధకుడు నరేష్ మృతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 8: ఎస్వీ యూనివర్సిటీ ప్రాచ్య పరిశోధనా సంస్థ (ఓఆర్ఐ) పరిశోధకుడు డాక్టర్ వెలిగారం నరేష్(43) మృతి చెందారు. చిత్తూరు సమీపంలో గల బ్రాహ్మణపల్లెకు చెందిన ఆయన తరిగొండ వెంగమాంబ సాహిత్యంపై ఆచార్య చిట్రాజు గోవిందరాజుల పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. కొంతకాలంగా కామెర్లతో బాధపడుతూ సోమవారం కన్నుమూశారు.నరేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతి పట్ల ఓఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ వీసీ వేంకటేశ్వర్లు సంతాపం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి వారు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

గంజాయి స్వాధీనం


నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్ఈబీ అధికారులు

సూళ్లూరుపేట, జనవరి 8: పట్టణంలోని హోలిక్రాస్ కూడలి వద్ద 3 కిలోల గంజాయిని ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్ర తిరువళ్లూరుకు చెందిన మహమ్మద్‌బాబు బ్యాగుతో అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో ఎస్ఈబీ అధికారులు అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా గంజాయి లభ్యమైంది. ఒడిశాలో ఉన్న చెందిన సురేష్ వద్ద గంజాయిని కొనుగోలు చేసి తమిళనాడుకు తీసుకెళ్తున్నట్లు మహమ్మద్‌బాబు విచారణలో వెల్లడించినట్లు ఎస్ఈబీ సీఐ సూర్యనారాయణ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ శశికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడొద్దు

పెళ్లకూరు, జనవరి 8: సంక్రాంతి పండుగ సందర్భంగా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడరాదని ఎస్ఐ శ్రీకాంత్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కోడిపందేలు, పేకాట, బెట్టింగ్ నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో మద్యం విక్రయాలు జరిపితే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

ఓట్ల కోసం వస్తారు... సమస్యలు పట్టించుకోరా?

- రోడ్లు, డ్రైనేజీ అధ్వానం, తాగునీటికీ ఇబ్బందులు
- మిచౌంగ్ తుఫాన్ పరిహారమూ అందలేదు
- రోడ్డుపై బైఠాయించి లోతువానిగుంట కాలనీవాసుల నిరసన


రోడ్డుపై ఆందోళన చేస్తుతన్న లోతువానిగుంట కాలనీవాసులు

నాయుడుపేట టౌన్, జనవరి 8: ఓట్ల కోసం మాత్రం వస్తారు... కానీ మా సమస్యలు ఎవరూ పట్టించుకోరా అంటూ మండలంలోని లోతువానిగుంట కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నాయుడుపేట - పాత వెంకటగిరి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో కనీసం తాగునీరు కూడా సక్రమంగా సరఫరా కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లు, డ్రైనేజీ అధ్వానంగా ఉన్నాయన్నారు. ఇటీవల సంభవించిన మిచౌంగ్ తుఫాన్‌లో ఇళ్లల్లోకి నీరుచేరి నానాకష్టాలు పడితే అధికారుల పలకరింపు కూడా కరువైందన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.2,500, ఉచిత బియ్యం ఇప్పటికీ అందలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు గంటసేపు రోడ్డుపై బైఠాయించడంతో ట్రాఫిక్ ఆగిపోవడంతో ఎస్ఐ రఘునాథ్ సంఘటనాస్థలికి చేరుకొని కాలనీవాసులతో మాట్లాడి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

కాలనీలో సమస్యలివీ... !

పట్టణ పరిధిలో అతిపెద్ద మురికివాడైన లోతువానిగుంట కాలనీలో తాగునీరు సరిగ్గా రావడంలేదు. కనీసం చేతి బోరు కూడా పనిచేయడంలేదు. రోడ్లు, మురుగ కాలువలు అధ్వానంగా ఉన్నాయి. ఇక కాలనీవాసులకు పక్కాఇళ్లు మంజూరు చేయకపోవడంతో చాలా మంది పూరిగుడిసెల్లో నివాసం ఉంటున్నారు. కాలనీలో ఎక్కడచూసినా చెత్తాచెదారం పేరుకుపోవడంతో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. కాలనీలో ఉన్న పోలీస్ క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు చుట్టూ ముళ్ల చెట్లు అధికమవడంతో విషసర్పాల బెడద ఎక్కువగా ఉంది.




అధ్వానంగా ఉన్న రోడ్డు, డ్రైనేజీ - తాగునీటి కొళాయికి దిమ్మెవేసి ఉన్న దృశ్యం - నిరుపయోగంగా ఉన్న చేతి బోరు

అంగన్వాడీలను బెదిరిస్తే ఆదిపరాశక్తులవుతాం



సూళ్లూరుపేటలో పాటలు పాడుతూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు - గూడూరులో దీక్ష

సూళ్లూరుపేట, జనవరి 8: తమ డిమాండ్లను పరిష్కరించకుండా బెదిరిస్తే ఆదిపరాశక్తులవుతామని అంగన్వాడీ యూనియన్ నాయకురాలు హైమావతి అన్నారు. 28వ రోజు సమ్మెలో భాగంగా సోమవారం కోటపోలూరు క్రాస్ వద్దనున్న టీవీఆర్ఆర్ కల్యాణ మండపం వద్ద జాతీయ రహదారి పక్కనే కూర్చొని అంగన్వాడీలు నిరసన చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకుండా బెదిరింపులకు పాల్పడడం అన్యాయమన్నారు. సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా నాలుగున్నరేళ్ల మాయమాటలతో కాలం గడిపాడరన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాటలు పాడి బై.. బై.. బై జగనన్నా అంటూ నినాదాలు చేశారు. దర్నా వద్దకు వచ్చిన సీడీపీవో శారదాంబ విధులకు హాజరుకావాలని అంగన్వాడీల నోటీసులు ఇచ్చే ప్రయత్నం చేయగా తమ డిమాండ్లను అంగీకరించే విధులకు హాజరుకాబోమని తిరస్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు రమణయ్య, అల్లెయ్య, సుధాకర్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను రాష్ట్రప్రభుత్వం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు అన్నారు. సోమవారం స్థానిక గ్రామసేవకుల భవనం వద్ద అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 28వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని అమలు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో శివకుమార్, సురేష్, రామయ్య, ప్రసాద్, ఇంద్రావతి, ప్రభావతి, మునికుమారి, పెంచలమ్మ, లక్ష్మి, హైమావతి, మంగమ్మ, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలంటూ 28 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలు సోమవారం వినూత్నరీతిలో నిరసన తెలిపారు. చిన్నారుల చేత కాలకృత్యాలు చేయిస్తూ తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు ముకుంద మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం మహిళలు అని కూడా చూడకుండా అంగన్వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ సంఘం ప్రాజెక్టు కార్యదర్శి శ్యామలమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకురాలు పాల్గొన్నారు.

కోట: రాష్ట్ర ప్రభుత్వం సమ్మెను అణచివేసేందుకు ఎస్మా చట్టాన్ని ప్రయోగించిదని, ఇలాంటి బెదిరింపులకు భయపడేది లేదని అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు హెచ్చరించారు. కోటలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట సోమవారం కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు నిరసన తెలిపారు. ఎస్మా జీవో ప్రతులను తగలబెట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

వెంకటగిరి: బంగారుపేట ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీలు చేస్తున్న రిలేదీక్ష సోమవారం కొనసాగింది. కార్యక్రమంలో స్వరూపారాణి, మంజుల, సుభాషిణి, మమ్ములాబేగం, లక్ష్మి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

తిరుమల నడకమార్గాల్లో నిర్భయంగా రావొచ్చు: టీటీడీ ఈవో

తిరుమల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల నడకమార్గాల్లో అడవి జంతువుల నుంచి భక్తుల రక్షణ కోసం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని, నిర్భయంగా శ్రీవారి దర్శనానికి నడిచి రావచ్చని టీటీడీ ఈవో ధర్మారెడ్డి అన్నారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో సోమవారం టీటీడీ, ప్రభుత్వ ఫారెస్ట్ అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ నడకమార్గాల్లో అడవి జంతువుల నుంచి భక్తుల రక్షణ కోసం ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(వైల్డ్‌లైఫ్), ఏపీ చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ అధ్యక్షతన రాష్ట్ర ప్రభుత్వం జాయింట్ కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ఆ కమిటీ క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి నివేదిక సమర్పించిందన్నారు. టీటీడీ, ప్రభుత్వ అటవీశాఖ ఇప్పటివరకు తీసుకున్న స్వల్పకాలిక చర్యలపై చర్చించారు. దీర్ఘకాలిక చర్యలైన అడవి జంతువుల పర్యవేక్షణ, అందుకు కావాల్సిన భవన సదుపాయం, సిబ్బంది, వ్యూలైన్ల ఏర్పాటు, బయోఫెన్సింగ్(పొదల కంచె), ఏరియల్ వాక్ వే, అండర్‌పాస్, ఓవర్ పాస్‌ల కోసం స్థల ఎంపిక ఇతర మౌలిక వసతులపై చర్చించారు. కెమెరాట్రాప్‌లు, మానిటరింగ్ సెల్, వ్యూలైన్ల ఏర్పాటు, అవుట్‌పోస్టుల నిర్వహణకు సత్వరం చర్యలు చేపట్టాలని, ఏడవమైలు నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు నడకదారికి ఇరువైపులా లైటింగ్ వసతి కల్పించాలని, మానటరింగ్ సెల్‌కోసం భవనాన్ని సమకూర్చాలని సీఈని కోరారు. నడక మార్గాల్లో వ్యర్థాలు లేకుండా చూడాలని హెల్త్ ఆఫీసర్‌ను ఆదేశించారు. సమావేశంలో జేఈవో వీరబ్రహ్మం, సీసీఎఫ్ నాగేశ్వరరావు, ఎఫ్ఏసీఏవో బాలాజీ, చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరరావు, జూపార్క్ క్యూరేటర్ సెల్వం, డీఎఫ్‌వో శ్రీనివాస్, తిరుపతి డీఎఫ్‌వో సతీష్ పాల్గొన్నారు.

ఏపీ హిస్టరీ కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శిగా ప్రొఫెసర్ నాగోలు కృష్ణారెడ్డి



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 8: ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శిగా ప్రొఫెసర్ నాగోలు కృష్ణారెడ్డి నియమితులయ్యారు. ఈనెల 6, 7 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించిన ఏపీ హిస్టరీ కాంగ్రెస్ 46వ వార్షిక సదస్సులో ఆయన్ను ఎన్నుకున్నారు. ఎస్వీయూనివర్సిటీ ప్రాచీన భారతదేశ చరిత్ర, సంస్కృతి, పురావస్తు విభాగంలో ప్రొఫెసర్‌గా పదవీ విరమణ పొందారు. టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తిరుమల మ్యూజియం డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. చరిత్ర, సంస్కృతి, సాహిత్యంపై 16 పుస్తకాలు, 95 పరిశోధనా వ్యాసాలు రాశారు. 72 జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్నారు. ప్రత్యేకించి శాసనాల వెనుక దాగున్న చరిత్రను వెలికితీశారు. ఇదివరకే ఏపీ హిస్టరీ కాంగ్రెస్ ప్రొసీడింగ్స్‌కు సంపాదకులుగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏపీ హిస్టరీ కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు. ఎస్వీయూ ఓఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ పీసీ వేంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు.

టైక్వాండో అసోసియేషన్ నూతన కార్యవర్గం

తిరుపతి(విద్య), జనవరి 8: తిరుపతిలో టైక్వాండో అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా టైక్వాండో కార్యవర్గ సమావేశం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఇందులో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ప్రకటించారు. అధ్యక్షుడిగా టి.ధనంజయులు, వైస్ ప్రెసిడెంట్లుగా డి.క్రాంతికుమార్, కె.వెంకటరమణాచారి, ప్రధాన కార్యదర్శిగా ఎ.మనోహరనాయుడు, సంయుక్త కార్యదర్శులుగా సి.రామనన్, సి.శంకర్, కోశాధికారిగా బి.శ్రీనివాసులు, ఈసీ సభ్యులుగా బీఎస్ అరుణ్, ఎం.సంతోష్, వి.కిరణ్, ఎ.కోదండం, సీఆర్ హర్షితను ఎన్నుకున్నారు. కాగా సంఘ ఆధ్వర్యంలో ఈనెల 17న చిత్తూరులో సబ్ జూనియర్ టైక్వాండో జిల్లా స్థాయి పోటీలను నిర్వహించాలని తీర్మానించామని ప్రకటించారు. వ్యవస్థాపకులు చంద్రశేఖర్ మాట్లాడుతూ క్రీడాకారులకు మెరుగైన శిక్షణ, సదుపాయాలు కల్పించేందుకు తనవంతు సహకారం అందిస్తామని తెలిపారు.

స్విమ్స్‌లో పులివర్తి నానికి చికిత్స

తిరుపతి సిటీ, జనవరి 8: ఒంటిపై పెట్రోలు పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన టీడీపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి పులివర్తి నానిని చికిత్స నిమిత్తం సోమవారం టీడీపీ నేతలు స్విమ్స్ అత్యవసర విభాగానికి తీసుకువచ్చారు. చంద్రగిరి నియోజకవర్గంలో దొంగ ఓట్లు తొలగించాలని తిరుపతి ఆర్డీవో కార్యాలయం ముందు ఆయన ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. దీక్ష విరమించాలని, లేకపోతే అరెస్టు చేయాల్సి వస్తుందని పోలీసులు హెచ్చరించారు. ఆయన దీక్ష విరమించేది లేదని, అవసరమైతే ఆత్మహత్యకు సిద్ధమవుతామని చెప్పి పెట్రోలు ఒంటిపై పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆ సమయంలో పెట్రోలు కంట్లో పడటంతో తెరవలేని స్థితిలోకి చేరాడు. వెంటనే చికిత్స నిమిత్తం స్విమ్స్ అత్యవసర విభాగానికి తీసుకువచ్చారు. అక్కడి డాక్టర్లు వైద్యం అందించి భయపడాల్సిన అవసరం లేదన్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ టీడీపీ నేతలతో కలసి ఆయన్ను పరామర్శించారు.

తెలుగు భాషపై మక్కువ పెంచుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న బాలచంద్రరాజు

వడమాలపేట, జనవరి 8: తెలుగుభాషపై ప్రతిఒక్కరూ మక్కువ పెంచుకోవాలని అమెరికాలోని సిలికానాంధ్ర విశ్వవిద్యాలయ ముఖ్య విద్యాధికారి చమర్తి బాలచంద్రరాజు అన్నారు. సోమవారం వడమాలపేట బాలుర ఉన్నత పాఠశాలలో కవి, రచయిత, ఉపాధ్యాయుడు సురేంద్ర రచించిన భావతరంగాలు, అడవిమల్లి కవితా సంపుటిలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలచంద్రరాజు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లోని ఎన్ఆర్ఐలు తమ పిల్లలకు తెలుగుభాష నేర్పించడానికి ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. తెలుగు భాషాభివృద్ధి కోసం సిలికానాంధ్ర యూనివర్శిటీ మనబడి పాఠశాల ద్వారా పలు దేశాల్లో సేవలు అందిస్తోందని చెప్పారు. తాను చదివిన వడమాలపేట బాలుర ఉన్నత పాఠశాల అభివృద్ధి కృషి చేస్తానని చెప్పారు. అనంతరం బాలచంద్రరాజును ఉపాధ్యాయులు సన్మానించారు.

పుత్తూరు వార్తలు

సచివాలయ భవనం ప్రారంభం


సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఆదిమూలం

నారాయణవనం, జవవరి 8: మండల పరధిలోని అరణ్యంకండ్రిగ సచివాలయ నూతన భవనాన్ని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం చేతుల మీదుగా ప్రారంభించారు. ప్రజలకు నేరుగా సేవలందించడంలో సచివాలయాలు ముందుంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దివాకర్ రెడ్డి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

పుత్తూరు/వడమాలపేట, జనవరి 8: పుత్తూరు, వడమాలపేట మండలాల్లో సోమవారం మంత్రి మంత్రి రోజా పింఛన్లను పంపిణీ చేశారు. పుత్తూరు 3890 మందికి, వడమాలపేట మండలంలో 5,261 మందికి పింఛన్లు అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

డిమాండ్లు పరిష్కరించకుంటే ఉద్యమం మరింత ఉధృతం


ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

పుత్తూరు అర్బన్, జనవరి 8: ప్రభుత్వం స్పందించి కార్మికుల డిమాండ్లు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ పట్టణ గౌరవ అధ్యక్షుడు మహేష్ స్పష్టం చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు చేస్తున్న సమ్మె ఆరవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనాలు పెంచాలని గత నాలుగేళ్లుగా ప్రభుత్వాన్ని కోరుతున్నప్పటికీ చలనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలతో చాలీచాలని వేతనాలతో కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం కార్మికుల శ్రమను దోచుకుంటోందని ధ్వజమెత్తారు. వేతనాల పెంపుతో పాటు ఇతర డిమాండ్లను పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమవుతామని ఆయన హెచ్చరించారు. అప్పటి వరకు సమ్మెను కొనసాగిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు.

ప్రభుత్వ బెదిరింపులకు నెరవం



వర్షంలో గొడుగులతో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

పుత్తూరు అర్బన్, జనవరి 8: ప్రభుత్వ బెదిరింపులకు నెరవబోమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ స్పష్టం చేశారు. సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద వర్షంలో గొడుగులతో అంగన్వాడీ కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు సమ్మె విరమించి మంగళవారం నుంచి విధులకు హాజరు కావాలని ప్రభుత్వం జారీ చేసిన నోటీసులకు తలొగ్గే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ప్రజాస్వామబద్ధంగా తాము చేస్తున్న ఆందోళనలకు అన్నివర్గాల నుంచి మద్దతు ఉందన్నారు. ప్రభుత్వం నిరంకుశ వైఖరితో వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేతనాల పెంపు విషయమై స్పష్టత ఇస్తేనే సమ్మె విరమిస్తామని, లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు విజయకుమారి, ధనమ్మ, రాధా, పద్మజ, మోహన్‌లక్ష్మి, లలిత, అన్నపూర్ణ, గంగులమ్మ, కృష్ణవేణి, ప్రమీల పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలతో పేదల కష్టాలు


కరపత్రాలను అందిస్తున్న డాక్టర్ హెలిన్

నారాయణవనం, జనవరి 8: ప్రభుత్వ వైఫల్యాల కారణంగా పేద ప్రజలు నానాకష్టాలు పడుతున్నారని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ హెలిన్ పేర్కొన్నారు. సోమవారం నారాయణవనంలో టీడీపీ మండలాధ్యక్షుడు గిరిబాబు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా దిగవ గాండ్ల వీధి, రెడ్డి వీధిలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హెలిన్, మాజీ ఎమ్మెల్యే హేమలత మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర ధరలతో పేద ప్రజలు అవస్థలు పడుతున్నారని అన్నారు. సంక్షేమ పథకాలను షరతుల పేరుతో కొద్దిమందికి మాత్రమే అందజేస్తున్నారని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి రాగానే అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి షణ్ముగం, యూనిట్ ఇన్‌చార్జి బాబు, బూత్ ఇన్‌చార్జి కేఎస్.రవి, తెలుగు మహిళా అధ్యక్షురాలు లత తదితరులు పాల్గొన్నారు.

వితంతు పింఛను ఇప్పించండి సారూ..!

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 8: తనకు వితంతు పింఛను మంజూరు చేయాలంటూ పుత్తూరు మండలం, కల్యాణపురం ఎస్టీకాలనీకి చెందిన సుజాత కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో అధికారులను వేడుకొంది. తన భర్త అల్లూరయ్య ఒకటిన్నర సంవత్సరం క్రితం మరణించాడని, అప్పటి నుంచి కుటుంబానికి పెద్దదిక్కు లేకుండా పోయిందన్నారు. వితంతు పింఛను కోసం దరఖాస్తు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని, సచివాలయానికి వెళ్లినా లాభం లేకపోయిందన్నారు. మీరైనా న్యాయం చేయాలంటూ అధికారులకు విజ్ఞప్తి చేసింది.

టీటీడీ ఆలయాల సమాచారంతో కొత్త వెబ్‌సైట్

తిరుపతి (కల్చరల్), జనవరి 8: తిరుపతి, ఇతర ప్రాంతాల్లోని టీటీడీ అనుబంధ ఆలయాలకు సంబంధించిన పూర్తి సమాచారంతో కొత్త వెబ్‌సైట్ (ttdevasthanams.ap.gov.in)ను టీటీడీ సోమవారం ప్రారంభించింది. మహతి వేదికగా టీటీడీ పాలకమండలి అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి దీన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఇందులో 60 ఆలయాలకు సంబంధించి స్థల పురాణం, దర్శనం, పూజాదికాల వేళలు, రవాణా, వసతి, ఆర్జిత సేవల వివరాలు పొందుపరిచామని భూమన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో ధర్మారెడ్డి, జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.83 కోట్లు

తిరుమల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.83 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 76,058 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 22,543 మంది తలనీలాలు సమర్పించారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

పాత పింఛను విధానం అమలు చేయండి



రేణిగుంట, జనవరి8: భారత రైల్వేలో ఉద్యోగులకు, కార్మి కులకు 2004 జనవరి నుంచి పాత పింఛను విధానం అమలు చేయాలని రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ గుంత కల్ డివిజన్ ప్రెసిడెంట్ రాజు డిమాండ్ చేశారు. స్థానిక రైల్ కళ్యాణ మండపం సమీపంలోని ఎంప్లాయీస్ సంఘ్ కార్యాలయం వద్ద సోమవారం ఉద్యోగులు పాతపింఛను విధానం అమలు చేయాలని చేపట్టిన రిలే దీక్షలను ఆయన ప్రారంభించారు. ఈ ఆందోళనలో నాయకులు ఎస్‌సీఎం రెడ్డి, చంద్రకుమార్, వేదమూర్తి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఫాన్ట్ జీసెస్ పాఠశాలలో సక్రాంతి సంబరాలు

రేణిగుంట, జనవరి8: స్థానిక పాత చెక్‌పోస్ట్ వద్ద ఉన్న ఇన్‌ఫాన్ట్ జీసెస్ ఉన్నత పాఠశాలలో సోమవారం సంక్రాతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయదుస్తులు ధరించి సంబరాల్లో పాల్గొన్నారు. విద్యార్థినులు వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. గోజు-రై కరాటే పోటీల్లో మెడల్స్ సాధించిన 56 మందిని ప్రిన్స్‌పాల్ గురుశ్రీసైమన్, ప్రధానోపాధ్యాయులు ఆల్ఫ్రెడ్ ప్రేమ్‌చంద్‌లు అభినందించారు.

ఉమ్మడి ప్రభుత్వ ఏర్పాటే ధ్యేయం



శ్రీకాళహస్తి, జనవరి 8: టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వ ఏర్పాటు చేయడమే తమ ధ్యేయమని జనసేన జిల్లా కార్యదర్శి కొట్టేసాయి తెలిపారు. తెనాలిలో సోమవారం జనసేన కీలక నేత నాదెండ్ల మనోహర్‌ను శ్రీకాళహస్తికి చెందిన ఆ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీడీపీ జనసేన ఉమ్మడి అభ్యర్థి గెలుపుపై చర్చించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుమార్, మహేష్ పాల్గొన్నారు.

నైతికత ఉంటే వైసీపీని వీడండి: జనసేన

శ్రీకాళహస్తి, జనవరి 8: నైతికత ఉంటే వైసీపీలో ఉన్న కాపునేతలంతా ఆ పార్టీని వీడాలని జనసేన నాయకులు హితువు పలికారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. శ్రీకాళ హస్తిలో బలిజ భవనం నిర్మాణంలో అడుగు ముందుకు పడకపోవడంపై జనసేన ప్రశ్నించిందన్నారు. దానికి సమాధానం చెప్పకుండా వైసీపీలోని కాపు నాయకులు ఎదురు దాడి చేయడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్‌చార్జి తోట గణేష్, పట్టణ ఉపాధ్యక్షులు రవికుమార్ రెడ్డి, నియోజకవర్గ ఐటీ కో-ఆర్డినేటర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించండి

శ్రీకాళహస్తి, జనవరి 8: భూ సమస్యలు పరిష్కరించాలని సీపీఐ శ్రీకాళహస్తి మండల కార్యదర్శి శివకుమార్ విజ్ఞప్తి చేశారు. తిరుపతిలో సోమవారం జరిగిన స్పందనలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సాల్‌కు వినతిపత్రం సమర్పించారు. శ్రీకాళహస్తి మండలంలోని ముచ్చువోలు, చుక్కలనిడిగల్లు, వాగివేడు, అలాగే తొట్టంబేడు మండల కేంద్రంతో పాటు కారాకొల్లు, రౌతు సూరిమాల గ్రామాల పరిధిలోని భూసమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు తులసి రాజన్, శ్రీనివాసులు, వెంకటయ్య, పోలయ్య, బాలయ్య పాల్గొన్నారు.

విశ్రాంత డీఎంకు సన్మానం

శ్రీకాళహస్తి జనవరి 8: విశ్రాంత ఆర్టీసీ డీఎం సాయిరాం బాబును ఘనంగా సత్కరించారు. శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోలో సాయిరాం బాబు డీఎంగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. శ్రీకాళహస్తిలోని ఎస్‌డీకే నగర్‌లో విక్రం టెన్నిస్ అకాడమీ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ సీనియర్ టెన్నిస్ పోటీల్లో ఆయన పాల్గొన్నారు. 82 ఏళ్ల వయసులో 70 ప్లస్ డబుల్ విభాగంలో విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా ఆర్టీసీ సిబ్బంది సోమవారం ఆయన్ను సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, విక్రమ్ టెన్నిస్ అకాడమీ వ్యవస్థాపకులు డాక్టర్ చంద్రశేఖర్ యాదవ్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

శ్రీకాళహస్తి, జనవరి 8: శ్రీకాళహస్తి మండలం ఇసుకగుంట వద్ద రైలు పట్టాల పక్కన గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ నరసింహులు అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

సత్యవేడు టికెట్ ఆదిమూలానికే ఇవ్వాలి

నాగలాపురం, జనవరి 8: సర్వేల పేరుతో సత్యవేడు నియోజకవర్గ వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే ఆదిమూలంకు టికెట్ లేదని చెప్పడం సరికాదని నాగలాపురం మండల వైసీపీ కన్వీనర్ అపరంజిరాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రానున్న ఎన్నికల్లో అధిష్టానం పునరాలోచించి ఆదిమూలానికే టికెట్ ఇవ్వాలని కోరారు.

శాస్త్రోక్తంగా నంది విగ్రహం ప్రతిష్ట

శ్రీకాళహస్తి జనవరి 8: శ్రీకాళహస్తి మండలం తొండమానుపురంలోని భోగేశ్వర స్వామి సన్నిధిలో సోమవారం నంది విగ్రహ ప్రతిష్ట శాస్త్రోక్తంగా జరిగింది. తమిళనాడుకు చెందిన అరన్ పని అరుల్ కట్టలై ట్రస్టు నిర్వాహకులు నంది విగ్రహంతో పాటు రేకుల షెడ్డును ఏర్పాటు చేశారు. సోమవారం వేదోక్తంగా పూజలు చేసి ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో దాతలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో యాంకర్ లాస్య



శ్రీకాళహస్తి, జనవరి 8: బుల్లితెర యాంకర్ లాస్య సోమవారం కుటుంబ సమేతంగా ముక్కంటి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయంలో రాహుకేతు సర్ప దోష నివారణ పూజలు చేసుకున్నారు. దర్శనానంతరం వేద పండితుల ఆశీర్వాదం పొందారు.

శ్రీకాళహస్తిలో ముసురు వాన

శ్రీకాళహస్తి, జనవరి 8: శ్రీకాళహస్తిలో సోమవారం ముసురు వాన కురిసింది. రెండు రోజులు ముందు నుంచే వాతావరణం బాగా చల్లబడింది. సోమవారం వేకువ జామున నుంచి పెద్ద ఎత్తున మబ్బులు ముసురుకున్నాయి. ఉదయం ఏడు గంటల నుంచి వర్షం ప్రారంభమైంది. సాయంత్రం వరకూ అడపాదడపా జల్లులు కురిశాయి.

కలెక్టరేట్‌లో స్పందనకు వినతులు

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 8 : కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. పలువురు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వినతిపత్రాలు సమర్పించారు.

వికలాంగ పింఛను కోసం మూడేళ్లుగా తిరుగుతున్నా..



అయ్యా మాది కరకంబాడీలోని తారక రామ నగర్. మూడేళ్ల క్రితం షుగర్ వ్యాధి వచ్చి ఎడమ కాలు తొలగించారు. అప్పటి నుంచి కూలి పనులకు వెళ్లలేకపోతున్నా. కుటుంబ పోషణ కష్టంగా ఉంది. వికలాంగ పింఛను కోసం కాళ్లరి గేలా తిరుగుతున్నా అధికారులు ఏమాత్రమూ కనికరించడం లేదు. మీరైనా స్పందించి పింఛను ఇప్పించండి.

- అల్లీబాషా, కరకంబాడి

లోన్ ఇప్పిస్తానని భూమిని అమ్మేశాడు



ఎంపేడు గ్రామంలోని సర్వే నెం.201/1లో 1.60ఎకరాల భూమిని ప్రభుత్వం నా భర్త అంకీస పేరుతో పట్టా ఇచ్చింది. దానిపై రుణం ఇప్పిస్తానని మా గ్రామానికి చెందిన లింగయ్య పట్టా పాసుపుస్తకం, భూమికి సంబంధించిన రికార్డులు తీసుకెళ్లాడు. రుణం తీసివ్వలేదు. మా భూమిని అమ్మినట్లు, పట్టా రద్దు చేసినట్లు తెలిసింది. మాకు న్యాయం చేయండి.

- జ్ఞానమ్మ, షికారీ, ఎంపేడు, శ్రీకాళహస్తి మండలం

మద్యం స్వాధీనం..ఒకరి అరెస్టు

సత్యవేడు, జనవరి 8: ద్విచక్రవాహనంలో మద్యం తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. శ్రీసిటీ ఎస్‌ఐ అరుణ్ కుమార్‌రెడ్డి కథనం మేరకు.. అప్పయ్యపాళెంకు చెందిన అశోక్ వరదయ్యపాళెం మండలం చిలమత్తూరు మద్యంషాపు నుంచి 15 మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి తరలిస్తుండగా అప్పయ్యపాళెం తనిఖీ కేంద్రం వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు శ్రీసిటీ పరిశ్రమల్లో పనిచేసే కూలీలకు ఎక్కువ ధరకు మద్యం విక్రయించేవాడని విచారణలో తేలింది. మద్యంతోపాటు ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు.

టీడీపీతోనే ప్రజాసంక్షేమం సాధ్యం



ఏర్పేడు, జనవరి 8: టీడీపీతోనే ప్రజాసంక్షేమం సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురవారెడ్డి అన్నారు. ఏర్పేడు మండలం నచ్చనేరి పంచాయతీలో సోమవారం బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, మునెయ్య, సుబ్రహ్మణ్యం రెడ్డి, సుబ్బరామిరెడ్డి, వరదారెడ్డి, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ప్రారంభం



ఏర్పేడు, జనవరి 8: ఏర్పేడు మండలం బండారుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానో పాధ్యాయులు నిర్మల్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ ట్రైనింగ్ కౌన్సిలర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఇంటికి దారి చూపండి



వినతిపత్రం చూపుతున్న సుబ్రహ్మణ్యం

వరదయ్యపాళెం, జనవరి 8: పాండూరు సచివాలయం పరిధిలోని బీసీ కాలనీ (ముత్తరాశి పాళెం)లో చిట్టేటి సుబ్రహ్మణ్యం తన ఇంటికి దారి సౌకర్యం కల్పించాలని తహసీల్దారు గౌరీశంకర్‌రావుకు సోమవారం వినతిపత్రం సమర్పిం చారు. తమ ఇంటి ముందు ఉన్న డీకేటీ స్థలంలో రాకపోకలు సాగించే వారమని ప్రస్తుతం కొందరు కబ్జా చేసి తమను ఆ దారిలో వెళ్లకుండా అడ్డుకుంటున్నారని వాపోయారు. సమస్య పరిష్కరించాలని వీఆర్‌వో ఆదిలక్ష్మిని తహసీల్దార్ ఆదేశించారు.

ప్రకృతి వ్యవసాయ పంటలతో ఆరోగ్యం

పిచ్చాటూరు, జనవరి 1: ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటలు ఆహారంగా తీసుకోవడంతో ఆరోగ్యంగా జీవించవచ్చని వర్డ్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ గంగాధర్ తెలిపారు. సోమవారం చెంచురాజుకండ్రిగలోని ప్రకృతి వ్యవసాయ పాఠశాలలో వెంగళత్తూరు జడ్పీ హైస్కూలు విద్యార్థులకు ప్రకృతి వ్యవ సాయంపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవు పేడ, పంచతంతో జీవా అమృతం, ఘన జీవామృతం తయారీని ప్రత్యక్షంగా చేసి విద్యార్థులకు చూపించారు. రసాయన ఎరువులో రోగాలబారిన పడుతున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, ఉపాధ్యాయులు, రైతులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ సంఘీభావం

వరదయ్యపాళెం, జనవరి 8: సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు యూటీఎఫ్ వరదయ్యపాళెం శాఖ మద్దతు పలికింది. అరకొర జీతాలతో ఇబ్బంది పడుతున్న వారికి మద్దతుగా ఆర్థికసాయం చేసి సహకరించాలనే పిలుపుతో యూటీఎఫ్ నాయకులు సోమవారం రూ.33 వేలు అందజేశారు. అదేవిధంగా ఎంటీఎస్ సంఘం ఉపాధ్యాయులు రూ.3వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండలాధ్య క్షుడు శశికుమార్, ప్రధాన కార్యదర్శి సురేష్ భగవాన్ పాల్గొన్నారు.

జీవో నెం.2ను ఉపసంహరించాలి

సత్యవేడు, జనవరి 8: అంగన్వాడీలు తక్షణమే విధులకు హాజరుకావలని విడుదల చేసిన జీవో నెం.2ను వెంటనే ఉపసంహరించుకోవాలని టీడీపీ సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ హెలెన్ కోరారు. సోమవారం ఆమె మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకుండా ఎస్మా ప్రయోగించడం గర్హనీయమన్నారు. అంగన్వాడీలకు టీడీపీ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.

సంక్రాంతి పండుగ ఎంతో ప్రత్యేకం



సంక్రాంతి పండుగ జరుపుకుంటున్న విద్యార్థులు

శ్రీకాళహస్తి, జనవరి 8: అన్ని పండుగల్లోనూ సంక్రాంతికి ఎంతో ప్రత్యేక స్థానం ఉందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ అన్నారు. పట్టణ శివారులోని సెయింట్ జేవియర్స్ పాఠశాలలో సోమవారం సంక్రాంతి వేడు కలు ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు, పొంగలి పెట్టడం, గొబ్బె మ్మలు, రంగవల్లులు వేసి సందడిగా పండుగ చేసుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ విశేషాలను పిల్లలకు వివరించారు. హెచ్‌ఎం షర్లీ తదితరులు పాల్గొన్నారు.

వర్షంలోనూ ఆగని ఆందోళనలు



శ్రీకాళహస్తి, సత్యవేడు, పిచ్చాటూరులో గొడుగులతో నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలు

సత్యవేడు, జనవరి 8: తమ సమస్యలు పరిష్కారం కోసం అంగన్వాడీలు చేపట్టిన సమ్మె నిరవధికంగా కొనసాగుతోంది. సమ్మెలో భాగంగా సోమవారం సత్యవేడు ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. వర్షం పడుతున్నా లెక్క చేయకుండా గొడుగులతో నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్, సీఐటీయూ జిల్లా నాయకులు మునిరాజు, మురళి, అంగన్వాడీ కార్యకర్తలు నిర్మల, శాంతి, ఝాన్సీ, కాంతమ్మ, భారతి, నాగరాజు, మంజుల, చందామరి, విజయ, పార్వతి, అనురాధ, సుజాత, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: తమ సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం సమ్మెను నిర్వీర్యం చేయడం అసాధ్యమని అంగన్వాడీలు స్పష్టం చేశారు. శ్రీకాళహస్తి పట్టణం ఐసీడీఎస్ కేంద్రం వద్ద సోమవారం 28వ రోజు నిరవధిక సమ్మెను కొనసాగించారు. ఇందులో భాగంగా జోరు వానలోనూ రిలే దీక్షతో సమ్మెను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ శ్రీకాళహస్తి ప్రాజెక్టు అధ్యక్షురాలు కల్పన, కార్యదర్శి స్వర్ణ, కార్మిక సంఘాల నాయకులు, శోభ, తనుజ,



రేణిగుంటలో నిరసన

జయంతి, మాధవి, సుభాషిణి, సుబ్బలక్ష్మి, రేష్మ, శాంత, రాజ్యం, మాధవి, భారతి, రాధమ్మ విజయమ్మ, సీఐటీయూ నాయకులు మణి, పుష్ప రేవతి పాల్గొన్నారు.

పిచ్చాటూరు: పిచ్చాటూరులోనూ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా గొడుగులతో సమ్మె కొనసాగించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు ఇందిర, రాజేశ్వరి, కృష్ణవేణి, శ్రీదేవి, ప్రమీల, ఆయాలు పాల్గొన్నారు.

రేణిగుంట: రేణిగుంటలోనూ అంగన్వాడీలు జోరు వర్షంలోనూ గొడుగులు చేతపట్టుకుని ఆందోళన చేపట్టారు. ఏపీ అంగన్ వాడీవర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ నాయకులు ధనమ్మ,రాధ, నాయకులు భాగ్యలక్ష్మి, అంబిక, ప్రభావతి, పార్వతి, ధరణి పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల స్థలాన్ని కాపాడండి



డీఆర్‌వోకు వినతిపత్రం సమర్పిస్తున్న చక్రాల ఉష

శ్రీకాళహస్తి, జనవరి 8: శ్రీకాళహస్తిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు చక్రాల ఉష విజ్ఞప్తి చేశారు. తిరుపతి కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో భాగంగా కళాశాల స్థలం కబ్జాపై డీఆర్‌వో పెంచలకిషోర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారం రోజుల నుంచి కళాశాల స్థలాన్ని చదును చేసి కబ్జా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. కొందరు అధికార పార్టీ నేతలు కళాశాల స్థలంలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించామని చెప్పుకోవడం బాధాకరమన్నారు. సంబంధిత అధికారుల ద్వారా చర్యలు తీసుకుంటామని డీఆర్‌వో పెంచలకిషోర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ టీఎన్‌ఎస్‌ఎఫ్ అధ్యక్షులు హేమంత్‌రాయల్, నాయకులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ స్థలాన్ని ప్రభుత్వభూమిగా గుర్తించండి

ఆన్‌లైన్‌లో పాతయజమాని పేరును తొలగించండి ● మంగాపురం సర్పంచ్ వినతి

సత్యవేడు, జనవరి 8: సత్యవేడు మండలం అలిమేలు మంగాపురం గ్రామంలో నిర్మించిన గ్రామ సచివాలయ భవన స్థలాన్ని ప్రభుత్వ భూమిగా గుర్తించాలని సర్పంచ్ శిరీష కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో జేసీ శుభంబన్సాల్‌కు వినతిపత్రం అందించారు. సర్వే నెం.37/3బీలో 0-37 సెంట్లు భూమిని గ్రామ సచివాలయ భవన నిర్మాణం కోసం ఓ వ్యక్తి నుంచి ప్రభుత్వం భూమి కొనుగోలు చేసిందని గుర్తుచేశారు. అయితే ఇంకా ఆన్‌లైన్‌లో అప్పటి యజమాని పేరే ఉందని దాన్ని రద్దు చేయాలని విన్నవించారు. అవసరమైన చర్యలు తీసుకుంటామని జేసీ హామీ ఇచ్చినట్లు సర్పంచ్ తెలిపారు.

ఓంశక్తి మహిళలకు ఆర్థికసాయం

ఏర్పేడు, జనవరి 8: ఏర్పేడు మండలం ముసలిపేడు గ్రామం బీసీకాలనీ నుంచి మేళ్మరవత్తూరు శక్తి మాల ధరించిన మహిళల ఇరుముడి కార్యక్రమం సోమవారం జరిగింది. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైసీపీ మండల ఇన్‌చార్జి వారి ప్రయాణ ఖర్చుల నిమిత్తం రూ.12వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, మునిరత్నంనాయుడు, కుసురుయాదవ్, వెంకటేష్‌యాదవ్, మునిరాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

శ్రీకాళహస్తి జనవరి 8: పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం పెరిగిన పింఛన్లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మృత్యుంజయుడికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, జనవరి 8: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మృత్యుంజయ స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత మృత్యుం జయ సన్నిధిని అర్చకులు శుద్ధిచేశారు. అనంతరం భక్తుల నుంచి సంకల్పం స్వీకరించారు. వివిధ పూజా ద్రవ్యాలతో శాస్త్రోక్తంగా అభిషే కించారు. వేదమంత్రాలతో ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ముక్కంటి అన్నదానానికి విరాళం



శ్రీకాళహస్తి, జనవరి 8: ముక్కంటి ఆలయంలో నిర్వహించే నిత్య అన్నదాన పథకానికి సోమవారం నెల్లూరుకు చెందిన లావణ్య రూ.50వేల నగదు విరాళం ఇచ్చారు. పరిపాలన భవనంలో ఆలయ ఏఈఓ సతీష్, పీఆర్వో నాగభూషణంను కలిసి నగదు అందజేశారు. ఆలయ అధికారులు వారికి ధన్యవాదాలు తెలిపారు. దాత కుటుంబ సమేతంగా ఆలయాన్ని దర్శించుకున్నారు.

సమస్యలు పరిష్కరించండి

కేవీబీపురం, జనవరి 8: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు విశేష స్పందన లభించింది. అధికంగా భూ సమస్యలపైనే అర్జీలు వచ్చాయి. అర్జీలు పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీదేవి తన సిబ్బందికి సూచించారు.

ఈ భూమి మాదే.. కాదు మాదే..!

● అటు రెవిన్యూ ఇటు అటవీ శాఖల వాదన

● మధ్యలో నలిగిపోతున్న పట్టాలు పొందిన రైతులు



రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీదేవి, అటవీ అధికారులు

కేవీబీపురం, జనవరి8: మండలంలో ఆదవరం రెవిన్యూలో ఉన్న సర్వే నంబర్లు 194ఏ, 194బీలో ఉన్న సుమారు 4.87 ఎకరాల భూమి పక్కా సెటిల్‌మెంట్ నేల. ఈ భూమిని రైతులకు రెవెన్యూ వారు పట్టాలిచ్చారు. ఇటీవల అటవీ శాఖ వారు ఆ నేలలో ప్రవేశించ వద్దని అది రిజర్వుడు ఫారెస్టుకు చెందినదని రైతులపైన ఒత్తిడి తెచ్చారు. దీంతో రైతులు తహసీల్దార్‌ను ఆశ్రయించారు. ఈ వివాదంపై శ్రీకాళహస్తి ఎఫ్ ఆర్‌వో లోకేష్, డిప్యూటీ ఎఫ్‌ఆర్‌వో శ్రీనివాసులు సోమవారం తహసీల్దార్ శ్రీదేవిని కలిశారు. ఆ నేల తమదేనంటూ వాదించారు. దీంతో తహసీల్దార్ రికార్డులను పరిశీలించారు. 1952, 1957లో ఆ నేల సుమారుగా 250 ఎకరాల వరకు రెవిన్యూకు చెందినదిగానే ఉంది. ఆ నేలకు అప్పట్లో రైతులకు పట్టదారు పాసు పుస్తకాలు ఇచ్చారు. అప్పటి నుంచి ఆ నేల సెటిల్‌మెంట్‌గా చెలమణిలో ఉందని గుర్తించారు. అటవీ అధికారులు మాత్ర అందుకు అంగీకరించలేదు. చివరగా ఉమ్మడి జిల్లాలోని రికార్డులను సైతం పరిశీలించాక చర్చిద్దామని అటవీ అధికారులకు తహసీల్దార్ తెలియజేశారు. అంతవరకు రైతులపై చర్యలు తీసుకోరాదని సూచించారు. అటు అటవీ ఇటు రెవిన్యూ మధ్యలో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. జిల్లా అధికారులు స్పందించి న్యాయంచేయాలని రైతులు కోరుతున్నారు.

200మంది వైసీపీ కార్యకర్తలుటీడీపీలో చేరిక



వైసీపీ నాయకులకు కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న బొజ్జల సుధీర్‌రెడ్డి

ఏర్పేడు, జనవరి 8: ఏర్పేడు మండలం గోవిందవరం పంచాయతీలో మహేష్ నాయుడు, ముని కృష్ణ యాదవ్, వినోద్ నాయుడు, నరేంద్ర రాయల్, భాస్కర్ నాయుడు, శ్రీనివాసులు, కన్నయ్య, పెద్దకన్నయ్య తదితర నాయకులతో పాటు సుమారు 200 మంది కార్యకర్తలు వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీ సీనియర్ నాయకులు పేరం ధనంజయులునాయుడు, చిరంజీవులునాయుడు ఆధ్వర్యంలో సోమవారం పెద్దఎత్తున సమావేశం జరిగింది. టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రన్న పాలన రావాలంటే ప్రజలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. ధనంజయనాయుడు, చిరంజీవినాయుడు, నాగరాజునాయుడు, భూపతినాయుడు, రమేష్‌చౌదరి, చలపతి, సురేంద్ర, చలపతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని దక్షిణ కైలాసనగర్ కాలనీలో సుమారు 20 కుటుంబాల వారు టీడీపీ నాయకురాలు రిషితారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు విజయకుమార్, మాజీ కౌన్సిలర్ సుప్రజ, కరీం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అదాలత్

రేణిగుంట, జనవరి 8 : రేణిగుంట ఎఫ్‌సీఐ గిడ్డంగుల వద్దవున్న రూరల్ విద్యుత్ సెక్షన్ కార్యాలయం వద్ద మంగళవారం 10 గంటల నుంచి విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఈఈ కె.వాసుదేవరెడ్డి తెలిపారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వీకేఆర్‌పై కాలనీలో ఆక్రమణలపై చర్యలు



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

వరదయ్యపాళెం, జనవరి 8: చిన్నపాండూరు పంచాయతీ పరిధిలోని వీకేఆర్‌పై కాలనీలో ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. వీకేఆర్‌పై కాలనీలోని ఆక్రమణలపై 'రాత్రికి రాత్రే గుడెసెలు, దుకాణాలు ఏర్పాటు' అనే శీర్షికన ఆది వారం కథనం ప్రచురితమైంది. స్పందించిన తహసీల్దార్ గౌరీశంకర్‌రావు అక్రమ కట్టడాలు తొలగించాలని ఆర్‌ఐ వేణు, వీఆర్వో చలపతికి ఆదేశాలు జారీ చేశారు. కబ్జాకు గురైన స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని సూచిం చారు. ఆ మేరకు రెవెన్యూ అధికారులు ఆక్రమణలను సోమవారం పరిశీలించారు.

గ్రామస్తుల ఫిర్యాదు

కాలనీలో అక్రమాలపై గ్రామస్తులు సైతం తహసీల్దార్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. అంబేడ్కర్ భవనం, వినాయక ఆలయం, వాటర్ ట్యాంక్ నిర్మాణం కోసం కేటాయించిన స్థలం సుమారు ఎకరా వరకు అన్యాక్రాంతమైందని ఆయన దృష్టికి తీసు కెళ్లారు. స్థానికంగా ఉన్న వ్యక్తి కబ్జా చేసి ఇతరులకు అమ్ముతున్నాడని ఫిర్యాదు చేశారు.